

సత్యదేవుడి కార్తీకమాస ఆదాయం రూ.21.75 కోట్లు 7

ఇక పిఠాపురం కేంద్రంగా..! 6

- డిప్యూటీ సీఎం కార్యకలాపాలు ఇక్కడి నుంచేనా?
- మరో 2.63 ఎకరాల భూమి కొనుగోలు

కాకినాడలో ఓజీ హీరోయిన్



కాకినాడలో షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సినీనటి ప్రియాంక మోహన్ 6

పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్‌ను పాఠశాల యూడైస్‌లో ధ్రువీకరించాలి: డీఈవో

కాకినాడరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల నామినల్ రోల్‌ను సంబంధిత పాఠశాల యూడైస్‌లో ప్రధానోపాధ్యాయులు ఏ తప్పులు లేకుండా ధ్రువీకరించాలని డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో కోరారు. ఫీజు, యూడైస్‌లపై ఎటువంటి సందేహాలున్నా డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి గ్రీవెన్స్ సెల్‌కి కార్యాలయ పనివేళల్లో ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. పరీక్ష ఫీజును ఈనెల 30లోపు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చన్నారు. పరీక్ష ఫీజు రూ.125 అని వయోపరిమితి కోసం రూ.300 చెల్లించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు https://bseap.gov.in వెబ్‌సైట్‌లో తమ పాఠశాల లాగిన్‌లో లాగిన్ అయ్యి విద్యార్థి వివరాలను ధ్రువీకరించి ఫీజు చెల్లించాలని డీఈవో సూచించారు. సందేహాల నివృత్తికి 9959567275, 9490178184 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్.. గుండెపోటుతో మృతి

- మృతికి సంతాపంగా మండపేటలో దుకాణాల బంద్
- నివాళులర్పించిన మంత్రి సుభాష్, ఎంపీ హరీష్
- తరలివచ్చిన నాయకులు, వ్యాపారవేత్తలు 7



చుండ్రు శ్రీవరప్రకాష్(ఫైల్)

సుబ్రహ్మణ్య షష్ఠికి ముస్తాబు

- గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఆలవెల్లి మల్లవరంల్లో ఏర్పాట్లు
- కోరిన కోర్కెలు తీర్చే శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు 6



'దారి'కి తెస్తున్నారు!

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా మారిన రహదారులకు మంచిరోజులు వస్తున్నాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో రహదారుల దారుణ దుస్థితిపై వచ్చిన కథనాల నేపథ్యంలో డిసెంబరు నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆర్అండ్‌బీ అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వచ్చే నెలలోగా మొత్తం రూ.110కోట్లకుపైగా నిధులు వెచ్చించి రహదారులను దారికి తేవడానికి సిద్ధమయ్యారు. తాజాగా ఉమ్మడి జిల్లాకు రూ.49.50 కోట్లు మంజూరవగా, వీటితో పలు కీలక రహదారులను రిపేర్లు చేయడానికి నిర్ణయించారు. త్వరలో వీటికి టెండర్లు పూర్తిచేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయబోతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- నరకప్రాయంగా మారిన రోడ్ల రిపేర్లకు రూ.49.50 కోట్లు మంజూరు
- కాకినాడ జిల్లాలో 7 రోడ్లకు 16.21కోట్లు, కోనసీమలో రూ.30 కోట్లు
- రాజమహేంద్రవరంలో కేశవరం-బొమ్మూరు రోడ్డుకు రూ.2.78 కోట్లు
- వీటికి టెండర్లు పూర్తయ్యాక మరో రూ.60 కోట్లతో మిగిలినవీ దారికి..
- 'ఆంధ్రజ్యోతి' కథనాల నేపథ్యంలో రోడ్ల మరమ్మతులకు సీఎం ఆదేశం

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో రహదారులు గోతులమయంగా మారాయి. అడుగుతీసి అడుగు వేయాలంటేనే నరకప్రాయంగా మారాయి. ఏటా వర్షాలు, వరదలతో పట్టణాల నుంచి గ్రామాల వరకు రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. అయితే వీటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉండగా, గత వైసీపీ ప్రభుత్వం అయిదేళ్ల పాటు వీటిని పూర్తిగా గాలికి వదిలేసింది. జనం గోతుల రహదారుల్లో ప్రయాణించి మృత్యువాత పడడం, తరచు గాయాలపాలవుతున్నా వైసీపీ ప్రభుత్వం ఏనాడూ కనీసం పట్టించుకోలేదు. ఆ తర్వాత గడచిన ఏడాదిన్నరలో కోనసీమలో భారీ వర్షాలు, మూడుసార్లు గోదావరి వరద, తుఫాన్లతో రోడ్లన్నీ మరింత దారుణంగా మారాయి. అటు తూర్పుగోదావరి జిల్లాలో భారీవర్షాలు, తుఫాన్ల ప్రభావంతో వందల కిలోమీటర్ల మేర రోడ్లు రూపురేఖలు కోల్పోయాయి. అలాగే కాకినాడ జిల్లాలోను భారీవర్షాలు, తుఫాన్లు, ఏలేరు వరదతో రోడ్లన్నీ వందల కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. అయితే వీటిని చాలావరకు ప్రభుత్వం మరమ్మతులు చేసింది. ప్రధానంగా ఈ ఏడాది జనవరిలో సంక్రాంతి నాటికి రహదారుల కింద యుద్ధప్రాతిపదికన గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిన రోడ్లన్నింటినీ మరమ్మతులు చేసింది. ఒక్క కాకినాడ జిల్లాలో 119 రహదారులను రూ.31.76 కోట్లు వెచ్చించి గుంతలు పూడ్చింది. అలాగే కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో రూ.62కోట్లతో రిపేర్లు చేసింది. అయితే ఇవి చేయగా ఇంకా వందల కిలోమీటర్ల కొద్దీ రహదారులు మరమ్మతులకు నోచుకోలేదు. పైగా ఈలోపు ఈ ఏడాదిలో కురిసిన వర్షాలు, తుఫాన్ల ముప్పుతో ఆ రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కాకినాడ-సామర్లకోట రహదారిని రూ.1.50 కోట్లతోను, కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును రూ.80 లక్షలతోను, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోను అనేక రహదారులను మరమ్మతులు చేయగా, మళ్లీ దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అధ్వాన దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల కథనాలు ప్రచురించింది. అటు రాష్ట్రవ్యాప్తంగాను అన్ని జిల్లాల్లో రోడ్ల దుస్థితిపై వెలువడిన కథనాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. తక్షణం అన్నింటికి మరమ్మతు చేయాలని, డిసెంబరుకి ఎక్కడా రోడ్లపై గుంతలు కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వచ్చేనెల మొదట్లో రూ.49.50 కోట్లతో పలు రహదారుల మరమ్మతుకు ఆర్అండ్‌బీ సన్నద్ధమైంది.

ఆ జిల్లాలో రూ.30 కోట్లతో...

కోనసీమ జిల్లాలో ఇప్పటికే ఈ ఏడాది జనవరినాటికి పాట్ ఫ్రీ హోల్ కింద రూ.45 కోట్ల వరకు వెచ్చించి ప్రభుత్వం రహదారులను మరమ్మతు చేసింది. మిగిలిన రహదారులపైనా దృష్టిసారించింది. తాజాగా రూ.30 కోట్లతో 12 కీలక రహదారులను అద్దంలా మార్చబోతోంది. ముఖ్యంగా ముమ్మిడివరం-ముక్తేశ్వరం రహదారి మరమ్మతులకు రూ.1.67కోట్లు కేటాయించింది. ముమ్మిడివరం- కాట్రేనికోన ఐనాపురం రోడ్డుకు రూ.2.92కోట్లు, రాజవరం- పొదలాడ రూ.3.11కోట్లు, ఉప్పలగుప్తం మండలంలో సిరిపల్లి-మునిపల్లి రహదారి మరమ్మతుకు రూ.2.28 కోట్లు, ఐ.పోలవరంలో మురమళ్ల-ఎదుర్లంక రోడ్డుకి రూ.40.22 లక్షలు, ముమ్మిడివరం-ముక్తేశ్వరం రూ.1.67 కోట్లు, కాకినాడ జిల్లాలో సర్పవరం జంక్షన్ నుంచి లైట్‌హౌస్ పేట రోడ్డుకు రూ.1.97కోట్లు, తుని ఎర్రకోనేరు నుంచి వేమవరం రోడ్డుకు రూ.3.01కోట్లు, కత్తిపూడి పామర్రు రోడ్డు గొల్లప్రోలు పరిధిలో రూ.3.16 కోట్లు, తుని కత్తిపూడి రోడ్డు రూ.2.54కోట్లు, గండేపల్లి మండలం తాళ్లూరు-ఎల్లమిల్లి రూ.1.59 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గం పరిధిలో నరసాపురపుపేట-కాట్రావులపల్లి రహదారికి రూ.1.60 కోట్లు, కాజులూరు మండలం శలపాక-కాజులూరు రహదారి మరమ్మతుకు రూ.2.34 కోట్లు వెరసి కాకినాడ జిల్లాలో మొత్తం రూ.16.21 కోట్లు మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. అలాగే రాజమహేంద్రవరంలో కేశవరం వయా బొమ్మూరు రోడ్డు మరమ్మతుకు రూ.2.78 కోట్లు కేటాయించింది. వీటన్నింటికి ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవగా, వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభించి రహదారులను తీర్చిదిద్దడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. అలాగే ఇవి పూర్తయ్యేలోగా మరో రూ.60 కోట్లతో ఉమ్మడి జిల్లాలో తుఫాన్లు, వరదలు, భారీవర్షాలకు దెబ్బతిన్న మిగిలిన రహదారులను కూడా మరమ్మతు చేయనున్నారు. వీటిలో ఒక్క కాకినాడ జిల్లాలోనే మొంథా తుఫానుకు దెబ్బతిన్న రహదారులకు రూ.30 కోట్లకుపైగా నష్టం వాటిల్లగా వాటికి రిపేర్లు చేయనున్నారు. అలాగే ఇటీవల వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న కాకినాడ-సామర్లకోట రోడ్డుని ప్రభుత్వం రూ.2.50కోట్లతోను. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును అరకోటికిపైగా వెచ్చించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు.. పనులు ప్రారంభం

- 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'లో ప్రజల వినతి
- రూ.5లక్షలు కేటాయించిన మున్సిపల్ అధికారులు



తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న మునిసిపల్ ఏఈ అభిలాష్

పిఠాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి తాగునీరు అందక అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు త్వరలోనే పరిష్కారం కానున్నాయి. 'అక్షరం అండగా..పరిష్కారమే అజెండా'గా ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులు, వార్డు కౌన్సిలర్ విజ్ఞప్తి మేరకు అధికారులు నిధులు విడుదల చేయడంతో తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయి.

పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సెంటరు నుంచి కాకినాడ రోడ్డులోని పాత ఎక్సైజ్ స్టేషన్ వరకు తాగునీటి పైప్‌లైన్ లేకపోవడంతో ప్రజలు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తమకు తాగునీరు అందించే ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా పట్టణంలోని 18వ వార్డు కుంతీమాధవస్వామి ఆలయం వద్ద నిర్వహించిన సదస్సులో అక్కడి ప్రజలు, వార్డు కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ తాగునీటి ఇబ్బందులను ఏకరవు పెట్టారు. తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి తమకు నీరందించాలని కోరారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు సానుకూలంగా స్పందించారు. తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని అప్పటి మున్సిపల్ కమిషనరు నామా కనకారావు ప్రకటించారు. దీనికి అనుగుణంగా కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించారు. దీంతో రూ.5లక్షలతో ప్రభుత్వాస్పత్రి సెంటరు నుంచి కాకినాడ రోడ్డులో పాత ఎక్సైజ్ స్టేషన్ వరకు 592మీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. సోమవారం ఈ పనులను ప్రారంభించారు. పైప్‌లైన్ ఏర్పాటుకు గోతులు తవ్వారు. పైప్‌లు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. వారంలోగా పనులు పూర్తి చేసి తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు

రూ.5లక్షలతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులను 18వ వార్డు కౌన్సిలర్ పంపనబోయిన అన్నపూర్ణ, మున్సిపల్ ఏఈ అభిలాష్, టీడీపీ వార్డు అధ్యక్షుడు గుత్తుల రామకృష్ణ, పాదగయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడుగుత్తుర్తి విజయేంద్ర, దుగ్గిరాల మురళీకృష్ణ, దత్తు, కామేశ్వరరావు, వార్డు ఎమినిటీ సెక్రటరీలు ఆంజనేయులు, ప్రసాద్ సోమవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఏఈ తెలిపారు. తమ వార్డు ప్రజల సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఆంధ్రజ్యోతి దినపత్రికకు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు కౌన్సిలర్ అన్నపూర్ణ కృతజ్ఞతలు తెలిపారు.

కాకినాడ అభివృద్ధికి అందరి సహకారం అవసరం

- ఇన్‌చార్జి కమిషనరు సత్యనారాయణ



కమిషనరుగా బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఇన్‌చార్జి కమిషనరు ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది కలిసి పనిచేస్తే నగరాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లగలమన్నారు. హౌసింగ్ పీడీగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన సోమవారం సాయంత్రం ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్‌సిటీగా ఎదగడానికి భారీగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. వీటిని మరింత వేగవంతం చేయడానికి, పారిశుధ్యం, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, నీటి సరఫరా మెరుగుదల వంటి అంశాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామన్నారు.. కలెక్టర్ మార్గదర్శకత్వంలో అన్ని విభాగాలను సమన్వయం చేసి మెరుగైన సేవలందించడం తన లక్ష్యమన్నారు. అధికారులు, ఉద్యోగులు కొత్త ఇన్‌చార్జి కమిషనరుకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజరు, అకౌంటెంట్ రామశాస్త్రి పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ కార్యాలయాల్లో 'సంవిధాన్ దివస్'

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా బుధవారం సంవిధాన్ దివస్ నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగం 1949, నవంబరు 26న రాజ్యాంగ సభ ఆమోదం పొంది 1950, జనవరి 26న అమల్లోకి వచ్చిందన్నారు. మనదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యంగా అవతరించి చరిత్రలో నవశకానికి నాంది పలికిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారంఉదయం 11.30 గంటలకు సంవిధాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించాలన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలన్నారు.

తాగుతూ.. తూలుతూ..

- ప్రమాదాలకు కారణమవుతున్న మందుబాబులు
- అతిగా మద్యం సేవించి డ్రైవింగ్
- డ్రంకన్ డ్రైవ్ కేసులకూ భయపడని వైనం



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రాణాలు బలితీసుకునే మందుబాబులు పెరిగారు. 15ఏళ్ల బాలురు సైతం మద్యం సేవించే వాహనాలు నడపడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కాలంలో మద్యంతోపాటు మత్తు పదార్థాలకు, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడిన అనేకమంది యువకులు ప్రమాదాలకు కారణమవుతున్నారు. మద్యం మత్తులో వీరే ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొనడం, లేకుంటే రోడ్డు డివైడర్లు, చెట్లు, హైవేల్లో రహదారులకు ఇరువైపులా ఉండే రక్షణ గోడలను ఢీకొని ప్రాణాలు కోల్పోవడం, హెచ్చరికగా వాహనాలు నడిపి ఎదుటివారి ప్రాణాలు తీసే సంఘటనలు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కర్నూలు జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధమై 20మంది ప్రాణాలు కోల్పోయారు.. దీనికి ప్రధాన కారణం ఓ యువకుడు అతిగా మద్యం సేవించి డివైడర్‌ను ఢీకొని బైక్‌తో సహా రోడ్డుపై పడిపోవడమే. అటు రవాణా శాఖ, ఇటు పోలీసుశాఖలు డ్రంకన్ డ్రైవ్ కేసుల విషయంలో ఉదాశీనంగా వ్యవహరించడమే కారణమనిపిస్తోంది.

మద్యం సేవిస్తే ఏమవుతుందంటే..

మనిషి రక్తంలో ఆల్కాహాల్ 30 ఎంజీ/100 ఎంఎల్‌కు మించితే శరీరం, మెదడు పూర్తిగా అదుపు తప్పుతాయి. సాధారణ డ్రైవర్‌తో పోల్చితే మద్యంతాగిన చోదకుడివల్ల ప్రమాద ఆస్కారం 40రెట్లు ఎక్కువ. మద్యం తాగిన వారిలో వాహనం నడిపే నైపుణ్యం క్షీణిస్తుంది. దూకుడు, దుందుడుకుతనం పెరిగి ప్రమాదాలకు దారి తీస్తుంది. సాధారణంగా వాహనాన్ని నిదానంగా నడిపే వ్యక్తి సైతం మద్యం మత్తు తలకెక్కగానే దూకుడుగా వ్యవహరిస్తాడు. అప్రమత్తత తగ్గి తక్షణం నిర్ణయం తీసుకునే శక్తి మందగిస్తుంది. చేతుల్లో పట్టు, హ్యాండిల్ స్టీరింగ్‌పై అదుపు తప్పుతుంది. ముప్పును సైతం పసిగట్టలేరు. ఎవరైనా వాహనానికి అడ్డువచ్చినా ఆపలేరు. పరిసరాలపై పట్టు కోల్పోతారు. స్వీయ నియంత్రణ కోల్పోతారు. కంటి చూపు మందగిస్తుంది. ఎదుటి వారి వాహనాలను గుర్తించలేరు.

జిల్లాలో డ్రంకన్‌డ్రైవ్ కేసులను రవాణాశాఖ, పోలీసు అధికారులు నమోదు చేస్తున్నా వాహన చోదకుల్లో మార్పు రావడం లేదు. కొంత మంది కోర్టుకు వెళ్లి ఫైన్ కట్టేందుకు సైతం సిద్ధమైపోతున్నారు. తనిఖీలు కేవలం జిల్లా కేంద్రాలకే పరిమితమవుతున్నాయి. అదీ కూడా వారాంతాల్లోనే. జాతీయ, ప్రధాన రహదారుల్లో అప్పుడప్పుడు మాత్రమే తనిఖీలు చేస్తున్నారు. తాగి వాహనం నడిపితే పోలీసులకు చిక్కడం తథ్యమనే భయం కల్పించలేకపోతున్నారు. పదేపదే మద్యం తాగి వాహనాలు నడిపే వారి వివరాల సమాచారం రవాణా, పోలీసు అధికారుల వద్ద కూడా లేదు. ఎవరైనా పట్టుబడితే జరిమానాలు విధించడం, తర్వాత వదిలేయడం సర్వసాధారణమైంది. డ్రంకన్ డ్రైవ్ కేసుల విచారణలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. శిక్షలు నామమాత్రంగా ఉంటున్నాయి.

శిక్షలు ఇలా..

మోటారు వాహనాల చట్టం ప్రకారం మద్యం మత్తులో వాహనం నడు పుతూ తొలిసారి పట్టుబడితే రూ.పదివేల జరిమానా, ఆరు నెలల వరకు జైలు శిక్ష, లేదా రెండూ విధించే అవకాశం ఉంది. రెండోసారి పట్టుబడితే రూ.15వేల జరిమానా, రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రెండూ విధించివచ్చు. మూడునెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలంపాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయాలి. వీటిని కఠినంగా అమలు చేయాలి.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి: కలెక్టర్



ఎమ్మెల్యే వనమాడితో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సంతృప్తిస్థాయిని పెంచే దిశగా అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి నూరుశాతం నాణ్యతతో అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. బియ్యం కార్డుల మంజూరు, పించన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు,ఆక్రమణల తొలగింపు వంటి అంశాలకు సంబంధించి 462 అర్జీలు స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, కేఆర్ఆర్సీ ఎస్డీసీ రత్నమణి, సీపీవో త్రినాద్, డీపీవో రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 42 అర్జీలు

కాకినాడక్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ జిల్లావ్యాప్తంగా 42మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గ్రీవెన్స్‌కు 10 భూతగాదాలు, 8కుటుంబ కలహాలు, 24 వివిధ కేసులకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

రైతుల్లో కలవరం

- వాతావరణంలో మార్పు.. గోనె సంచుల కొరత
- కొనుగోలు చేసిన ధాన్యం నమోదవని వైనం
- కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణా లోపం



ఆరబోసిన ధాన్యాన్ని వాతావరణ హెచ్చరికలతో రాశులుగా చేస్తున్న దృశ్యం

సామర్లకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వరిపంట కోతలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే కోతలు పూర్తయి మాసూళ్లు చేసిన ధాన్యం రాశుల ఆరబోత, ఆరబోసిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలిద్దామంటే రైతుసేవా కేంద్రాల్లో సిబ్బంది పత్తా లేకుండా పోతున్నారు. సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నా వ్యవసాయాధికారులు కానీ, సివిల్ సప్లయిస్ అధికారులు కానీ పట్టించుకోకపోవడం పట్ల వారు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయంలో ఉన్నారు. సామర్లకోట మండలంలోని వేట్లపాలేనికి చెందిన ఒక రైతు సరఫరా చేసిన ధాన్యానికి సోమవారం సాయంత్రం నాటికి నాలుగు రోజులైనా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమకాలేదు. ఈ విషయమై రైతు తెలుసుకునే ప్రయత్నంలో అసలు ధాన్యం మిల్లుకు సరఫరా చేసినట్లు నమోదు కాకపోవడం వల్లే రైతు ఖాతాలో డబ్బులు జమ కాలేనట్లు అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించాడు. రైతుసేవా కేంద్రం సిబ్బంది కూడా వ్యవసాయాధికారికి తప్పుడు సమాచారం ఇవ్వడంతో నష్టపోతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రైతుసేవా కేంద్రాలకు తాళాలు వేసి తమ సొంత పనులు చక్కబెట్టకుంటుండడంతో రైతులు రైతుసేవా కేంద్రాల వద్దకు వచ్చి నిరాశగా వెనుదిరుగుతున్నారు.

వాతావరణశాఖ అధికారులు బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కారణంగా భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరికలు చేస్తుండడంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. తాజా హెచ్చరికలుతో చేతికందిన పంట చేరువవుతుందా అనే భయాందోళనలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల మాసూళ్లు జరుగుతున్నాయి. వర్షాలు కురిస్తే పంటను కాపాడుకోవడం ఎలా అనే సందిగ్ధంలో రైతులు తలమునకలవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న రైతుసేవా కేంద్రాల్లో గోనె సంచుల కొరత తీవ్రంగా ఉన్నట్లు రైతు వర్గాల ద్వారా తెలుస్తోంది. సంచులు పెద్ద కన్నాలతో ధాన్యం నింపేందుకు వీలుగా లేకపోవడంతో రైతులు సొంత సంచులను నింపి కొనుగోలు కేంద్రాలకు తరలించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తేమశాతం 17గా నిర్ణయించగా మాసూళ్లు అవుతున్న ధాన్యానికి 23శాతంపైబడి తేమశాతంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నా ఎండలు లేకపోవడం కారణంగా తేమశాతం తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదే అదనుగా వరికోత యంత్రాలు అద్దెలను బారీగా పెంచేశారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ముస్తాబు

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఆలవెల్లి మల్లవరంల్లో విస్తృత ఏర్పాట్లు

స్వయంభూ ఆలయాల్లో రాత్రిపూట నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మకం



తాటిపర్తిలో స్వామి నిజరూప దర్శనం

(గొల్లప్రోలు రూరల్-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్వయంభూగా వెలిశారు. ఇక్కడ స్వామి వారి విగ్రహం వద్ద పాము కొంతకాలంగా పాటు ఉండి అక్కడే చనిపోవడంతో ఆ స్థానంలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడికి సమీపంలోనే అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయం ఉండడంతో మరింత ప్రాశస్త్యం లభించింది. సంతాన ప్రాప్తికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఎరుపు రంగు చారల చీర కట్టుకుని రాత్రంతా నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మకం. ఇక్కడ ఉన్న పాము పుట్ట 88 సంవత్సరాలుగా పూజలు అందుకుంటోంది.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

తాటిపర్తిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 88వ షష్ఠి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమై వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరుగుతాయి. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం, రాత్రి శూలాల సంబరం, చెట్టు భజన, తాడిపెద్దు సంబరం జరుగుతాయి. అనంతరం స్వామి కల్యాణం జరుగుతుంది. 30న మయూర వాహనంపై స్వామి గ్రామోత్సవం, డిసెంబరు 1న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షట్ సహస్ర నామార్చన, రాత్రి అపర్ణ పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం, శ్రీపుష్పయాగం జరుగుతాయి.



సుబ్రహ్మణ్యేశ్వరుడే ప్రత్యక్షంగా వెలసిన క్షేత్రం

ఆలవెల్లి మల్లవరం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా దర్శనమిచ్చిన క్షేత్రమిది. సర్పరూపంలో భక్తులకు దర్శనమిచ్చినచోటే ఆలయాన్ని నిర్మించారు. 1961-64 సంవత్సరాల మధ్య ఆలవెల్లి మల్లవరంలోని పంట పొలాల్లో సర్పం రైతులకు కనిపించింది. కదలకుండా అక్కడే ఉండిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తమకు ప్రత్యక్షంగా కనిపించాడని భావించిన ప్రజలు పూజలు నిర్వహించడంతో అక్కడే ఆలయం నిర్మించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా వెలిశాడనే సమాచారం తెలియడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చేవారు. వారి కోసం అప్పట్లో మల్లవరం రైల్వేగేటు వద్ద ప్రత్యేకంగా హాల్టు ఇవ్వడంతో పాటు స్టేషన్ నిర్మించారు. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వంటి ప్రముఖులు ఈ ఆలయాన్ని సందర్శించారు. సంతాన ప్రాప్తికి, కుజ దోష నివారణకు ఆలయ ఆవరణలో నిద్రిస్తే మంచిదని భక్తులు నమ్ముతారు.



కార్యక్రమాలు: వీరచోళ చతుర్వేద మండలం ఆలవెల్లి నిలయ మల్లవరం క్షేత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. బుధవారం ఉదయం స్వామికి అభిషేకాలు, షష్ఠి స్నానాలు, మహా రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి కల్యాణం జరుగుతాయి. 27న స్వామికి క్షీరాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రాత్రి కోలాటం, 28న స్వామికి మహా రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రాత్రి తెప్పోత్సవం, 29న క్షీరాభిషేకం, కుంకుమ పూజలు, నెమలి వాహనంపై గ్రామోత్సవం, 30న హనుమత్ పూజ, శ్రీపుష్పయాగం అనంతరం నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. ఈ నెల 27వ తేదీ రాత్రి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సంతాన శయన మందిరాన్ని ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ప్రారంభించనున్నారు. అనంతరం ఆయన ప్రవచనం జరుగుతుంది. షష్ఠి ఉత్సవాల్లో భక్తులు అధికంగా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని తాటిపర్తి, మల్లవరం ఆలయాల కమిటీల ప్రతినిధులు కోరారు.

శరణు శరణు సుబ్రహ్మణ్య

తూర్పు గోదావరి జిల్లా అనపర్తి వీర్రాజుమామిడిలో కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి

మాలధారణ చేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

(అనపర్తి-ఆంధ్రజ్యోతి)

తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని వీర్రాజుమామిడి వద్ద వేంచేసియున్న సుబ్ర హ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. అనపర్తి నుంచి ద్వారపూడి వైపు వెళ్లే ఎర్ర కాలువ కుడి గట్టుపై వీర్రాజు అనే రైతు మామిడి మొక్క నాటాడు. అది పెరిగి పెద్దదై పది మందికీ నీడనిస్తూ వీర్రాజు మామిడిగా ప్రసిద్ధి చెందింది. మామిడి మొక్క సమీపంలోనే తేతలి బాపయ్య అనే మరో రైతు రావి మొక్క నాటాడు. అవి రెండూ దినదిన ప్రవర్ధ మానమై వృక్షాలుగా మారాయి. అయితే 1970 ప్రాంతంలో అక్కడ వ్యవసాయం నిర్వహించే కొత్తూరుకు చెందిన రైతు చెట్ల తొర్రల్లో పాములు నివాసం ఉండడం గుర్తించి వాటికి పాలుపోయడం ప్రారంభించాడు. తాను పెట్టిన పాలు మరుసటి రోజుకు మాయమవుతుండడంతో.. వాటిని పాములు సేవిస్తున్నాయా, మరో ఇతర జంతువులు తాగుతున్నాయో తెలుసుకునేందుకు అక్కడ కాలువలోని ఇసుకను తీసి పరుపులా పరిచి పరీక్షించాడు. చివరకు ప్రతిరోజూ చెట్టు తొర్రలోకి పాములు వస్తున్నాయని గ్రహించి వాటికి పూజలు ప్రారంభించాడు. నాటి నుంచీ భక్తులు వచ్చి చెట్టు తొర్రలోని నాగేంద్రులకు పాలుపోసి పూజలు చేయడం మొదలుపెట్టారు. 1979లో స్వామివారు ఒక భక్తుడికి కలలో కనిపించిన విధంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఈ ఆలయం అభివృద్ధి చెందుతూ షష్ఠి ఉత్సవాలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

వీర్రాజుమామిడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రతి మంగళవారం ప్రత్యేక పండ్ల రసాలతో ఆలయ అర్చకుడు చందు శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేస్తున్నారు. స్వామివారికి పూజలు చేసి మొక్కుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. విద్య, వివాహం, సంతానం, వ్యాపార అభివృద్ధి మొదలైన కోరికలను స్వామి వారు తీరుస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



ఇక్కడ ప్రతిఏటా నిర్వహించే షష్ఠి ఉత్సవాల్లో మాలధారణ జరుగుతుంది. 12 సంవత్సరాల క్రితం కోనసీమ జిల్లా ద్వారపూడిలో ఉన్న ఈ ఆచారాన్ని తెలుసుకున్న ఇక్కడి భక్తులు వారి సహాయ సహకారాలతో మాలధారణ గావించి పదకొండు రోజుల దీక్ష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 12ఏళ్ల క్రితం కేవలం 28 మంది భక్తులతో ప్రారంభమైన మాలధారుల సంఖ్య నేడు 278 మందికి చేరుకుంది. అనేక మంది భక్తులు తమ కోరికలు నెరవేరిన వెంటనే వచ్చే షష్ఠి ఉత్సవాల్లో మాల ధరించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉద్యోగం, వివాహం, సంతానం వంటి కోరికలు నెరవేరాయని అనేక మంది భక్తులు చెప్తుంటారు. ఎంతో నియమనిష్ఠలతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామివారికి పూజలు చేసి కటిక నేలపై నిద్రిస్తారు.

సంతానం ప్రసాదించారు

నల్లమిల్లి నాగార్జునరెడ్డి, పీరా రామచంద్రపురం



సంతానం కోసం స్వామివారిని మొక్కుకున్నా. ఏడాదికి పుత్రుడు జన్మించాడు. నాటి నుంచి నేటి వరకు ప్రతిఏటా స్వామివారి మాల ధరించి పూజలు చేస్తున్నాను.

విద్యాభివృద్ధికి మొక్కుకున్నాను

తేతలి కార్తీక్‌రెడ్డి, అనపర్తి



విద్యాభివృద్ధి కోసం స్వామివారిని మొక్కుకుని మాల ధరించాను. ఐదేళ్లుగా మాలధారణ చేస్తున్నాను. స్వామికి పూజ చేయడం చాలా అనందంగా ఉంది.

స్వామి దయతో ఉద్యోగం సాధించాను

తమలంపూడి శ్రీసాయిరెడ్డి, అనపర్తి



ఉద్యోగం కోసం మొక్కుకుని మాల ధారణ చేశాను. స్వామి దయతో సంవత్సరంలోనే మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం సొంతంగా స్టార్టప్ కంపెనీ పెట్టి మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నాము. ప్రతిఏటా మాలధారణ చేస్తాను.

కోరిన కోర్కెలు తీర్చి... సంతానాన్ని ఇచ్చే శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చి సంతానాన్ని ఇచ్చే కొంగు బంగా రంగా బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు ఆరాధిస్తారు. శతాబ్దాల చరిత్ర గల ఈ స్వామి షష్ఠి ఉత్సవాలను సుమారు వందేళ్లుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని, 26న షష్ఠి తీర్థం జరుపుతామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి (వాసు) తెలిపారు.

ఆలయ చరిత్ర:

849-892 మధ్య (బిరుదాంకినవోలు) బిక్కవోలును రాజధానిగా చేసుకుని తూర్పు చాళుక్యులు పాలించారు. వీరిలో పెద్దవాడైన విజయాదిత్యుని తండ్రి నరేంద్ర మృగరాజు రాష్ట్ర కూటులతో యుద్ధం చేసి వారిని హతమార్చాడు. 108 యుద్ధాలు చేసి శత్రు సైన్యాలను తరిమికొట్టాడు. అనేక మందిని చంపడంతో హత్యా పాపం పోవడానికి 108 శివాలయాలను నిర్మించాడు. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా ఇక్కడ స్వామి విజయేశ్వరునిగా పేర్గాంచారు. బిక్కవోలు పరిసర ప్రాంతాల్లో నిర్మించిన 108 శివాలయాల్లో కొన్ని తురుష్కుల దాడిలో ధ్వంసం కాగా మరికొన్ని శిథిలమయ్యాయి. తూర్పు చాళుక్యుల చరిత్రకు సాక్ష్యాలుగా బిక్కవోలులో నేటికీ కొన్ని దేవాలయాలు చెక్కుచెదరకుండా వున్నాయి. మూడు ఆలయాలు గ్రామ సరిహద్దుల్లో ఉండగా, క్షేత్ర పాలకునిగా మహావిష్ణువు, లక్ష్మీదేవి ఆలయం వున్నాయి. గ్రామం మధ్యలో రాజరాజేశ్వర, గోలింగేశ్వర, చంద్రశేఖర దేవాలయాలు... మూడు ఒకే ప్రాంగణంలో ఉండడం విశేషం. పెద్దాపురం మహారాజు వత్సవాయి సూర్యనారాయణ తిమ్మ గజపతి గోలింగేశ్వర స్వామి ఆలయంలో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాడు. స్వామి పళనిలో వలె దక్షిణాభి ముఖాన దర్శనమిస్తాడు. స్వామి చెంతనే సహజమైన పుట్ట నేటికీ వుంది.



సహజ సిద్ధమైన పుట్టతో దర్శనమిస్తున్న శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

అందుకే ఈ క్షేత్రానికి కుజ క్షేత్రంగా పేరొచ్చింది. దేశంలోని రెండు దేవాలయాల్లో (బిక్కవోలు, పళని) మాత్రమే కుమారసుబ్రహ్మణ్యస్వామిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సంతానం లేని తిమ్మగజపతి సంతానం కోసం సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించి సంతానం పొందారట. అందుకే షష్ఠి రోజున సంతానార్థు లైన స్త్రీలు ఆలయంలోని పుట్టపై నాగుల చీరను వుంచి దానిని ధరించి ఆలయం వెనుక శయనిస్తారు. తద్వారా సంతానప్రాప్తి కలుగు తుందని నమ్మకం.

ఇక్కడ స్వామి దక్షిణాభిముఖంగా వుండడం చేత ఆయనకు ఇష్టమైన మంగళవారం, శుద్ధ షష్ఠి, కృత్తికా నక్షత్రం రోజుల్లో ప్రత్యేక పూజలు, మిగిలిన రోజుల్లో సర్పానికి పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. స్వామికి ఇష్టమైన పర్వదినాల్లో రాహు, కేతు, కుజ, సర్ప దోషాలకు ప్రత్యేక పూజలు చేయిస్తుంటారు.

బిక్కవోలు పేరు చెప్పగానే అందరికీ గుర్తుకొచ్చేది బాణసంచా. స్థానికంగా తయారీదారులైన గోలింగేశ్వర ఫైర్‌వర్క్స్, కనకదుర్గా హాస్సేనియా ఫైర్‌వర్క్స్ వారు తయారు చేసిన బాణసంచాను షష్ఠి రోజున రాత్రి పది గంటల నుంచి తెల్లవారేవరకు పోటీపడి కాలుస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

వాసు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు



రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన షష్ఠి ఉత్సవాలకు బిక్కవోలుకు లక్ష మందికి పైగా భక్తులు వస్తారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్నానవాటికలు, బారి కేడ్లు, నాగుల చీరలు ధరించి శయనించే స్త్రీలకోసం ఆలయం వెనుక ప్రత్యేక ఏర్పాట్లు చేశాము. ఈ ఏడు ఉత్సవాల నిర్వహణకు రూ.80 లక్షలు వ్యయం చేస్తున్నాం. ఈ నెల 27 నుంచి ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశాము. డిసెంబరు 2న భారీ అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఇక పిఠాపురం కేంద్రంగా..!

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యకలాపాలు ఇక్కడి నుంచేనా?
- ఇక్కడా జనసేన సెంట్రల్ ఆఫీసు
- పవన్ బస చేసేందుకు వీలుగా ఇల్లు
- మరో 2.63 ఎకరాలు కొనుగోలు
- ఇప్పటివరకూ కొన్నది 20.7 ఎకరాలు



పిఠాపురం పట్టణ శివారులో పవన్‌కల్యాణ్ తాజాగా కొన్న భూమి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఇక్కడ మరిన్ని భూములు కొనుగోలు చేస్తుండడం ఇందుకు బలం చేకూరుస్తోంది. జనసేన సెంట్రల్ ఆఫీసుతోపాటు పవన్ ఉండేందుకు ఇంటిని ఇక్కడ నిర్మించనున్నారు. కార్యకర్తలు ఉండేందుకు, సమావేశాల నిర్వహణకు, అతిథులు వస్తే ఉండేందుకు వీలుగా గెస్ట్‌హౌస్‌లు నిర్మించనున్నట్లు చెప్తున్నారు.

పిఠాపురం పట్టణ శివారులో ఇలింద్రాడ వద్ద గతంలోనే భూములు కొనుగోలుచేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తాజాగా మరిన్ని భూములు కొనుగోలు చేశారు. ఈ ప్రాంతంలో మరిన్ని పొలాలు కొనేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కోస్తాంధ్ర పరిధిలో రాజకీయ కార్యకలాపాలన్నింటినీ ఇక్కడి నుంచే నిర్వహించేందుకు వీలుగా ఇక్కడ నిర్మాణాలు జరగనున్నాయి. పిఠాపురంలో ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హోదాలో తొలిసారి సొంత నియోజకవర్గానికి వచ్చిన ఆయన తాను ఇక పిఠాపురం నివాసినేనని, ఇక్కడ భూములు కొనుగోలుచేశానని ప్రకటించారు. ఇక్కడే ఇల్లు నిర్మించుకుంటానని తెలిపారు. పార్టీ కార్యాలయం నిర్మిస్తానని, కార్యకర్తలు ఉదయం నుంచి రాత్రి వరకూ ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తానని చెప్పుకొచ్చారు. ఇది జరిగి 16నెలలు గడిచాయి.

ఎక్కడెక్కడ కొన్నారంటే..

పిఠాపురం పట్టణ శివారులో ఇల్లింద్రాడ జంక్షన్ దాటిన తర్వాత గొల్లప్రోలు టోల్‌గేట్‌కు వెళ్లే మార్గంలో తొలుత 3.52 ఎకరాలను కొనుగోలు చేశారు. తదనంతరం మరో విడతలో 14.63 ఎకరాలను కొన్నారు. కొద్దిరోజుల క్రితం జాతీయ రహదారిని చేర్చి ఉన్న 2.63 ఎకరాల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశారు. తాజా కొనుగోలుతో మొత్తం 20.78 ఎకరాలను కొనుగోలు చేసినట్లైంది. ఇవన్నీ ఇల్లింద్రాడ, భోగాపురం గ్రామాల పరిధిలోకి వస్తాయి. పిఠాపురం పట్టణానికి చేర్చి హైవే చెంతనే ఉండడంతో ఇక్కడ ఇల్లు, కార్యాలయాలు నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందనే భావనలో డిప్యూటీ సీఎం పవన్ ఉన్నట్లు చెప్తున్నారు. ఇంకా మరిన్ని భూములు కొనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

మంగళగిరితోపాటు ఇక్కడ

ప్రస్తుతం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో ఉంది. దీని నిర్మాణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. అదే తరహాలో పిఠాపురంలో కొన్న భూముల్లో సెంట్రల్ ఆఫీసు నిర్మాణం చేపట్టనున్నారు. పవన్ ఇక్కడి నుంచే కార్యకలాపాలు చేపట్టేందుకు, సమావేశాల నిర్వహణకు వీలుగా నిర్మాణంఉంటుందని అంటున్నారు. పవన్ నివాసంఉండేందుకు ఇల్లు నిర్మించనున్నారు.ఇక్కడే జనసైనికులు, వీరమహిళలు,నాయకులు ఉండేందుకు నిర్మాణాలు చేపట్టనున్నారు. పవన్ రాకపోకలు సాగించేందుకు వీలుగా హెలిప్యాడ్ నిర్మిస్తారు. అతిథులకు గెస్ట్‌హౌస్‌లు నిర్మించే అవకాశం ఉంది. ఇప్పటికే ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఈ భూములను పరిశీలించి వెళ్లారు. త్వరలోనే నిర్మాణాల ప్లాన్ రూపొందించి పనులు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అప్పటివరకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో..

పార్టీ కార్యాలయం, ఇల్లు నిర్మాణం పూర్తయ్యే వరకూ పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన సమయంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బసచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం గెస్ట్‌హౌస్‌ను ఆధునీకీకరించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. పవన్‌కోసం రెండు సూట్‌రూమ్‌లు సిద్ధం చేశారు. సమావేశాల నిర్వహణకు హాలు ఏర్పాటు చేశారు. ఇక నుంచి పిఠాపురం నియోజకవర్గంలో తరచూ పర్యటించేందుకు ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. మొత్తం మీద పవన్ కార్యకలాపాలకు పిఠాపురం కేంద్రం కానుంది.

హరోంహర.. శరవణభవ..

- అనపర్తిలో వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం



సంతానం లేని మహిళలపైనుంచి దాటుతూ ఆశీర్వదిస్తున్న కావడి ధరించిన మాలధారులు

అనపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని వీర్రాజు మామిడివద్ద కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో షష్ఠి వేడుకల సందర్భంగా సోమవారం కావడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు.ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కావడి భుజాన ఎత్తుకుని ఉత్సవాన్ని ప్రారంభించారు. సంతానంలేని మహిళలు స్వామిని పూజించారు. అనంతరం కావడి ధరించిన మాలధారులు వారిపైనుంచి దాటుతూ వారికి సంతానప్రాప్తి కలగాలని దీవించారు. ఈ సందర్భంగా రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ 279మంది స్వామి మాలధారులు కావడి ధరించి నృత్యాలు చేస్తూ ఉత్సవం నిర్వహించారు. ఇది తమిళనాడులోని పళనిని మరిపించింది. కావడి ధరించిన భక్తులకు మహిళలు పూజలు చేశారు. కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు వోగిరెడ్డి సత్తిరెడ్డి, మండ పోతారెడ్డి, మండ రామారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, తమలంపూడి వీర్రాఘవరెడ్డి,గంగిరెడ్డి,బూరయ్య పర్యవేక్షించారు.

8, 9 తేదీల్లో భారతీయ భాషలపై 'నన్నయ'లో జాతీయ వర్క్‌షాపు



జాతీయ కార్యశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 8,9 తేదీల్లో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరవుతారన్నారు. భారతీయ భాషా సమితి సీనియర్ నిపుణుడు ఆచార్య ఆర్ఎస్ సర్రాజు, అకడమిక్స్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు, తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్‌తో పాటు తెలుగు, హిందీ, సంస్కృత భాషా ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. భారతీయభాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలంపై మరింత అవగాహన పెంచుకునేందుకు నన్నయ అనుబంధ కళాశాలల తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులను, పాఠ్యపుస్తకాలు రచించిన విద్యావేత్తలను, భాషాభిమానులను ఆహ్వానిస్తున్నామన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ తలారి వాసు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాకినాడలో లక్కీ షాపింగ్ మాల్ 14వ షోరూమ్ ప్రారంభం



షాపింగ్‌మాల్‌లో కొత్తచీరతో సినీనటి ప్రియాంక మోహన్



వేదికపై హైపర్ ఆది సందడి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నటి అనసూయ

కాకినాడ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్‌లో లక్కీషాపింగ్ మాల్ 14వషోరూమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీ హీరోయిన్, ఓజీ ఫేం ప్రియాంక మోహన్, ప్రముఖ నటి అనసూయ భరద్వాజ్, హాస్యనటుడు హైపర్ ఆది విచ్చేసి సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. షాపింగ్ మాల్ అధినేతలు రత్తయ్య, శ్రీనివాస్, స్వామిలు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో ఫ్యామిలీ కలెక్షన్స్‌లో తిరుగులేని ఆదరణ పొందిన లక్కీ షాపింగ్ మాల్ కాకినాడలో 14వ షోరూమ్‌ను ప్రారంభించిందన్నారు. నమ్మకమైన నాణ్యత, అందుబాటు ధరలు, ట్రెండీ కలెక్షన్లు నిండిన లక్కీ షాపింగ్ మాల్‌లో బడ్జెట్ ధరల్లో వస్త్రాలను అందించనున్నామన్నారు. 30ఏళ్ల నమ్మకమైన వ్యాపార ప్రయాణంలో కొత్తమైలు రాయిని చేరుకుందన్నారు. నాలుగు అంతస్తుల విశాల భవనంలో ముస్తాబైన ఈ కొత్త మాల్ కాకినాడ ఫ్యాషన్ లైఫ్ స్టైల్‌కు కొత్త నిర్వచనం ఇవ్వనుందన్నారు. ఎత్నిక్‌వేర్‌నుంచి ఆధునిక వెస్ట్రన్ స్టైల్స్ వరకు అందుబాటు ధరల్లో ఉంచామన్నారు. నాయకులు గ్రంధి బాబ్జీ, బచ్చు శేఖర్, సంగిశెట్టి అశోక్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన యువతీ, యువకులు, మహిళలు సినీ తారలతో సెల్ఫీలు దిగారు.



ముగిసిన జూడో పోటీలు

ఓవరాల్ చాంపియన్స్ కాకినాడ జట్టు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జూడో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు రోజులు జరిగిన జూడో సీనియర్స్ చాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కాకినాడ జిల్లా జట్టు కైవసం చేసుకుంది. రెండో స్థానంలో తూర్పు గోదావరి జట్టు, ఉమెన్ కేటగిరీలో రెండో స్థానంలో కాకినాడ జిల్లా జట్టు నిలిచాయి. విజేతలకు జూడో సంఘం రాష్ట్ర సీఈవో వెంకట్, కాకినాడ చైర్మన్ వెలగ వెంకటకృష్ణారావు, కాకినాడ జిల్లా కోశాధికారి రమణ, డీఎస్ఏ కోచ్ తేజ బహుమతులు అందజేశారు. వివిధ జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల బాలుర ఖోఖో పోటీలు

- విజేతగా ప్రకాశం జిల్లా జట్టు
- ద్వితీయ, తృతీయస్థానాల్లో చిత్తూరు, విశాఖ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడాసమాఖ్యఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఈనెల 22నుంచి జరిగిన అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలుర ఖోఖో పోటీలు సోమవారం ముగిశాయి. ప్రకాశం జట్టు(ప్రథమ), చిత్తూరు జట్టు(ద్వితీయ), విశాఖ జట్టు(తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ముగింపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీఎస్డీవో సతీష్‌కుమార్, ఖోఖో సంఘ అధ్యక్షుడు పట్టాభి, మాచరరావు, సురేష్ రాజు, మాజీ కార్యదర్శి జార్జి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టు: బి.తిరుమల, పి.నవీన్, పి.వెంకటేశ్వర్లు, జి.చంద్రు, వై.యశ్వంత్, సీహెచ్‌డీ ప్రసాద్, ఎంవీఏ రెడ్డి, హెచ్‌వీడీ హనుమంతు, ఐ.రోహిత్, ఆర్.బాలాజీ, ఎస్.లక్ష్మణ్, టీఎస్ సాయిమణికంఠ, స్టాండ్‌బైలుగా జి.లక్ష్మీప్రసాద్, ఎ.జయంత్, జె.ఇల్లప్ప, జీడీ భాస్కర్, డి.రాజు.



ప్రకాశం జిల్లా జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

సత్యదేవుడి కార్తీకమాస ఆదాయం రూ.21.75 కోట్లు



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తగ్గిన వ్రతాల సంఖ్య
పెరిగిన ఆదాయం
వెల్లడించిన ఈవో సుబ్బారావు

అన్నవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఈ ఏడాది కార్తీకమాసంలో అన్ని విభాగాల ద్వారా రూ.21,75,95,167 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. సోమవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలను వెల్లడించారు. సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసంలో విచ్చేసిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను రెండోవిడత సోమవారం లెక్కించారు. రూ.1.77,73,072 నగదు, 43 గ్రాముల బంగారం, 978 గ్రాముల వెండి సమకూరాయి. అయితే వీటితో కలిపి కార్తీకమాసంలో మొత్తంగా రూ.21,75,95,167 ఆదాయం సమకూరిందని వెల్లడించారు. గతేడాది కార్తీక మాసంతో పోలిస్తే ఈ ఏడాది కార్తీకంలో వ్రతాల సంఖ్య 12,666 తగ్గగా అన్ని విభాగాల ఆదాయం నుంచి గతేడాది కంటే రూ.62,13,099 పెరిగిందన్నారు. వీటిలో ప్రధానంగా వ్రతం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.7.81 కోట్లు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ. 4.57 కోట్లు, హుండీలలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3.51 కోట్లు, సత్రంగదుల అద్దెల ద్వారా రూ.1.23 కోట్లు ఆదాయం లభించింది. మొత్తం 15 విభాగాల నుంచి ఈ ఆదాయం సమకూరింది. మిగిలిన విభాగాల ఆదాయాలను పరిశీలిస్తే కల్యాణమండపాల ద్వారా రూ.6.18 లక్షలు, స్వామివారి నిత్యకల్యాణాల నుంచి రూ.7.52 లక్షలు, ఆర్జితసేవల ద్వారా రూ. 9.63 లక్షలు, ఏసీ వ్రతాల నిర్వహణ ద్వారా రూ.61.56 లక్షలు, రవాణా విభాగం రూ. 38.39 లక్షలు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.89. 60 లక్షలు సమకూరాయని వెల్లడించారు.

తుఫాను వల్ల తగ్గిన వ్రతాలు

వ్రతాలసంఖ్య తగ్గడానికి మొంథా తుఫాను కారణమన్నారు. ఈ ఏడాది కార్తీకంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది సమష్టిగా కష్టపడి పనిచేశారన్నారు. చైర్మన్ రోహిత్ నిరంతరం పర్యవేక్షణతో సత్ఫలితాలు సాధించామన్నారు. దేవదాయశాఖ ప్రత్యేక అధికారిగా రీజినల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాధరావు, డిప్యూటీ కమిషనర్లు రమేష్‌బాబు, సూర్యచక్రధరరావు, విశ్వనాధరాజును నియమించి వారి సలహాలు, సూచనలు పర్యవేక్షణలతో అంతా సవ్యంగా జరిగిందన్నారు. ఇదిలా ఉండగా గతేడాది కంటే కార్తీకమాసం ఆదాయం పెరగడానికి లీజుల నుంచి గతంలో రూ.1.09 కోట్లు వసూలుకాగా ఈ ఏడాది కార్తీకంలో రూ.2.27 కోట్లు వసూలు కావడం, గతేడాది ఆదాయంలో హుండీల కానుకలు 32 రోజులుకు చూపించగా ఈఏడాది కార్తీక ఆదాయంలో హుండీ ఆదాయం 49రోజుల ఆదాయం చూపడంతో ఆదాయం పెరిగినట్టు ఈవో వెల్లడించారు. కార్తీకంలో ఇంజనీరింగ్ సివిల్ పనులకు రూ. 81.88 లక్షలు, విద్యుత్ విభాగం నుంచి రూ.20లక్షలు వ్యయం చేశారన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బాబూరావు, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, ఏఈవోలు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆదాయం రూ.70.11 లక్షలు

అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన శ్రీఅంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని కార్తీక మాసంలో లక్షలాది మంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అక్టోబరు 22 నుంచి నవంబరు 20 వరకు ప్రత్యేక దర్శనాలు, ప్రసాదాలు, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.37,99,038 ఆదాయం రాగా స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు ద్వారా రూ.32,12,352 ఆదాయం వచ్చింది. మొత్తంగా రూ.70,11,390 ఆదాయం వచ్చిందని ఏసీ ఎం కేటీఎస్వీ ప్రసాద్ తెలిపారు. నిత్యాన్నదానంలో 86వేల మంది భక్తులు నెల రోజుల పాటు స్వామివారి ప్రసాదం స్వీకరించారని తెలిపారు. స్వామివారి ఆలయానికి చేరుకునేందుకు ప్రధాన మార్గమైన చించినాడ బ్రిడ్జి మరమ్మతుల కారణంగా రాకపోకలు నిలుపుదల చేయడం, మొంథా తుఫాన్ కారనంగా గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఆదాయం స్వల్పంగా తగ్గిందని ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



యాళ్ల నరసింహస్వామి

అమలాపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థి యాళ్ల నరసింహస్వామి స్వర్ణ పతకం సాధించాడు. డిసెంబరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్టు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. స్వామిని స్కూలు ప్రిన్సిపాల్ నంద్యాల మనువిహార్ అభినందించారు.

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి

గుండెపోటుతో చుండ్రు శ్రీవరప్రకాష్ కన్నుమూత
ఇంటికి తరలివచ్చిన నాయకులు, వ్యాపారవేత్తలు




ప్రకాష్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల, అమలాపురం ఎంపీ హరీష్

మండపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన టీడీపీ నేత, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ (51) గుండెపోటుతో ఆదివారం రాత్రి అకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సతీమణి గతంలో అనారోగ్యంతో మరణించగా, ఆయన మాతృమూర్తి అనంతలక్ష్మి(అమ్ములు) ఏడాది కిందట కన్నుమూశారు. ఆయన కుమారుడు కిరీటి యూఎస్‌లో చదువుతుండగా ఆయన కుమార్తె ఇంటర్ చదువుతున్నారు. ప్రకాష్‌కు సేవాతత్పరుడిగా పట్టణంలో మంచిపేరు ఉంది. ఆదివారం రోజంతా పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన రాత్రి ఇంటికి చేరిన తర్వాత ఆరోగ్యం నలతగా అనిపించడంతో సమీపంలో ఆర్ఎంపీని పిలిపించుకున్నారు. తర్వాత మందులు వేసుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఒక్కసారి గుండెపోటుతోపాటు బీపీ అధికం కావడంతో ఆయనను ఇంటి వద్ద నుంచి హుటాహుటిన మండపేటలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆయన కన్నుమూశారని వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మరణ వార్త పట్టణమంతా వ్యాపించటంతో పార్టీ శ్రేణులు, హితులు కేపీ రోడ్డులో దాసిరెడ్డి వారి వీధిలో ఉన్న ఇంటికి చేరుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని ఇంటి వద్ద ఉంచారు. ఆయన కుమారుడు అమెరికా నుంచి వచ్చిన తర్వాత మంగళవారం అంత్యక్రియలను నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాగా ప్రకాష్ మృతితో ఆయన కుటుంబంతో పాటు టీడీపీలో విషాదచాయలు అలుముకున్నాయి. మండపేట మున్సిపల్ చైర్మన్‌గా 2014-2019 మధ్య పనిచేసిన ప్రకాష్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు శానిటేషన్ విషయంలో పలు అవార్డులు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు అన్నివిధాలా పార్టీ వ్యవహారాల్లో వెన్నుదన్నుగా నిలిచేవారు. ప్రస్తుతం మండపేటలో టీడీపీ వ్యవహారాల ఇన్‌చార్జిగానూ ఉన్నారు.

తీరనిలోటు : మంత్రి సుభాష్

విద్యావంతుడు రాజకీయనేత, వ్యాపారవేత్త, సామాజిక సేవా తత్పరుడిగా చుండ్రు శ్రీవరప్రకాష్ అతిపిన్న వయస్సులోనే గుండెపోటుకు గురై మరణించడం బాధాకరమని, ఆయన మృతి పార్టీకి కుటుంబానికి తీరని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం మండపేటలో ప్రకాష్ స్వగృహానికి మంత్రి చేరుకుని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ప్రకాష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అమలాపురం ఎంపీ జీవీ హరీష్‌మాధుర్, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మండపేటలో దుకాణాలు బంద్

చుండ్రు శ్రీవరప్రకాష్ ఆకస్మిక మరణంతో మండపేట పట్టణంలో చాంబర్ ఆఫ్ కామర్స్ పిలుపు మేరకు సోమవారం వ్యాపార సంస్థలు మూసివేశారు. అలాగే మంగళవారం పట్టణంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలను ప్రకాష్ మృతికి సంతాపంగా మూసివేస్తున్నామని ప్రైవేటు పాఠశాల యాజమాన్యల సంఘప్రతినిధులు సోమవారం ప్రకటించారు.

మోరిలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

13 జిల్లాల నుంచి పాల్గొన్న 312 మంది విద్యార్థులు



ఫెన్సింగ్ పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే దేవ..



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే దేవ, డీఈవో

అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో జానసుబ్బమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ టోర్నమెంట్ (ఎస్‌జీఎఫ్ అండర్-17) పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి అతిథులు, విద్యార్థులు ఆహ్వానం పలికారు. జాతీయ జెండా వందనం అనంతరం జ్యోతిని వెలిగించి ఎమ్మెల్యే, డీఈవో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలు మోరి హైస్కూలులో జరగడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రభుత్వం క్రీడల్లో తగిన విధంగా ప్రోత్సహిస్తుందని, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి నెలకొల్పాలని డీఈవో సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 312 మంది విద్యార్థులు పాల్గొనేందుకు విచ్చేశారు. జిల్లాకు 12 మంది బాలలు, 12 మంది బాలికలు చొప్పున 24 మంది వ్యక్తిగతంగా గ్రూప్ పోటీల్లో పాల్గొన్నారు. ఫెన్సింగ్ క్రీడలో 3 విభాగాలైన పాయల్, షాబర్, ఈపీలలో విజేతలైన మొదటి నాలుగు స్థానాలు సాధించిన 24 మందిని ఎంపిక చేసి డిసెంబరు 28, 29, 30 తేదీల్లో మహారాష్ట్రలోని శివాజీ షంబాజీ నగర్‌లో జరిగే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్టు క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ కడలి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో క్రీడల ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, మోరిహైస్కూలు హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, గుబ్బల ఫణికుమార్, గెద్దం మహాలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతి

కారకులెవరనేది ప్రభుత్వానికి నివేదిస్తాం
జీజీహెచ్ ఘటనపై విచారణ చేపట్టిన డీఎంఈ రఘునందన్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఇటీవల 8వ నెల గర్భిణితో పాటు ఆమె కడుపులో బిడ్డ కూడా మృతిచెందడంపై రాష్ట్ర డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ సోమవారం విచారణ నిర్వహించారు. నిర్లక్ష్యం కారణంగానే గర్భిణి మృతిచెందిందని ప్రాథమికంగా నిర్ధారించామని, అయితే నిర్లక్ష్యానికి కారకులెవరనేది ప్రభుత్వానికి నివేదిస్తామని డీఎంఈ పేర్కొన్నారు. ఈ విచారణ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు గైనకాలజీ సెమినార్ హాల్లో జరిగింది. డీఎంఈతో పాటు ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరీ, డీఎం హెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ హాజరయ్యారు. గైనిక్ విభాగంలోని యాంటీనేటల్, జీబీసీయూ వార్డుల్లోని వైద్యుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరిని విచారించారు. కొంతమంది నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. సేకరించిన నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని డీఎంఈ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఆసుపత్రిలో పలు అంశాలపై విషయాలను డీఎంఈ దృష్టికి తీసుకెళ్లారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ వ్యవహార శైలిని తీవ్రంగా ఆక్షేపించారు. ఇటువంటి దారుణ పరిస్థితులు జీజీహెచ్‌లో తలెత్తుతున్నా నిమ్మకు నీరెత్తుతున్నట్లు వ్యవహరిస్తున్నారని తగిన పర్యవేక్షణ ఉండడం లేదని డీఎంఈకి ఫిర్యాదు చేశారు. విచారణ సమయంలో మృతురాలి మల్లేశ్వరీ కుటుంబీకులు ఆమె 5 ఏళ్ల కుమార్తెతో కలిసి గైనిక్ విభాగం బయట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డీఎంఈ ఆందోళనకారులను విచారణ జరిగే ప్రాంతానికి పిలిపించారు. మృతురాలి సోదరి, వదిన నుంచి కూడా వివరణతో కూడిన స్టేట్‌మెంట్లను తీసుకున్నారు. విచారణలో గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్ ఉన్నారు.



ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు ప్రథమం



రగ్బీ పోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు

పిఠాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. కర్నూలులో ఈనెల 23, 24 తేదీల్లో స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాలు నుంచి బాలికల జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు విశేష ప్రతిభ కనబరచి మొదటిస్థానం సాధించింది. జిల్లా బాలికల జట్టుకు కోచ్, మేనేజర్లుగా పీడీలు శేషకుమారి, కె.నాగలింగేశ్వరరావు వ్యవహరించినట్టు రగ్బీ ఉమ్మడి జిల్లా కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. విజేతగా నిలిచిన బాలికల జట్టు సభ్యులు, కోచ్ లక్ష్మణరావును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వెంకటరెడ్డి, ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.దొరబాబు, చైర్మన్ వియ్యపు రామన్నరాజు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లకు ద్వితీయస్థానం

ఐ.పోలవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులలో ఈనెల 22 నుంచి 24వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలబాలికల పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇరు జట్లు ద్వితీయస్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో జి.వేమవరం జడ్పీ హైస్కూల్ చెందిన ఆరుగురు బాలురు, ఏడుగురు బాలికలు జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు. బాలుర విభాగం నుంచి ఎం.బాబు, మద్దింశెట్టి బాల ఆదిత్య ఉత్తమ క్రీడాకారులుగా ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎం.ఝాన్సీ బెస్ట్ క్యాచర్ అవార్డు అందుకుంది. విజేతలు, కోచింగ్ మేనేజర్ అడ్డగాళ్ళ నాగరాంప్రసాద్‌ను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం వారణాసి సుబ్రహ్మలక్ష్మీదేవి, సర్పంచ్‌లు నల్లా సుదర్శన్‌రావు, లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు తదితరులు అభినందించారు.



సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన బాలురు, బాలికల జట్ల సభ్యులు



రైలు ఢీకొని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

బిక్కవోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన బేరా సత్యనారాయణ (57) తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని తుమ్మలపల్లి రైల్వేగేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతూ గూడ్సు రైలు ఢీకొని మృతి చెందాడు. సామర్లకోట రైల్వే ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ బిక్కవోలులో లింగాల చెరువు వద్ద పనిచేస్తుంటాడు. అతడికి పుట్టుకతోనే పోలియో వల్ల కాలు, చేయి పడిపోయాయి. ఉదయం రైల్వేగేటు వద్ద బహిర్భూమికని రైలు పట్టాలు దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి విశాఖ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో శరీరం రెండుగా విడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసామని ఎస్ఐ వివరించారు.

మండపేటలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మండపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట కలువపువ్వు సెంటర్‌లో సోమవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడని పట్టణ పోలీసులు తెలిపారు. సెంటర్‌లో ఉన్న అమ్మవారి ఆలయం చెంతనే ఉన్న సిమెంట్ బల్ల వద్ద 70 ఏళ్ల వృద్ధుడు మరణించాడు. మృతదేహంపై నీలం రంగు లుంగీ, వంగపువ్వురంగు తెలుపు పచ్చగీతలు గల టీషర్ట్ ఉన్నాయి. వివరాలకు మండపేట సీఐ సురేష్‌ను 9440796591లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గొల్లప్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఆదివారం గొల్లప్రోలు బైపాస్ 216వ జాతీయ రహదారి కూడలి వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన ఉంద్రు కృష్ణారావు అలియాస్ రాజు (40) అక్కడిక్కడే మరణించగా, పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఉంటున్న గంధం శ్రీను (40)కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనును తొలుత పిఠాపురం సీహెచ్‌సీకి అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్టు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ వివరించారు.

ముగ్గురు మోటారుసైకిళ్ల దొంగల అరెస్ట్

ఆరు మోటారుసైకిళ్లు స్వాధీనం
నగరం ఎస్ఐ చైతన్యకుమార్ వెల్లడి

మామిడికుదురు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 6 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు గ్రామానికి చెందిన నాగళ్ల అరవింద్, మరో ఇద్దరు బాల నేరస్తులు రెండు మోటారు సైకిళ్లపై శివకోడు నుంచి కాకినాడ వైపు వెళ్తున్నారు. గెద్దాడ హైవేలో వాహనాలు తనిఖీ చేస్తున్న నగరం పోలీసులు ఆ ముగ్గురిపై అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ప్రశ్నించగా నగరం పోలీసుస్టేషన్‌లో నమోదైన 3 మోటారుసైకిళ్లు, రాజోలు, మలికిపురం, పాలకొల్లు పోలీసుస్టేషన్లలో చోరీ అయిన మరో 3 వాహనాలు కలిపి 6 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టినట్టు ఎస్ఐ తెలిపారు. వారిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ భీమరాజు, ఎస్ఐ చైతన్యకుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కొత్తపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెనికి చెందిన గొలకోటి ఆదిలక్ష్మి(110) సోమవారం ఇంటి వద్ద వయోభారంతో మృతిచెందింది. ఆమెకు ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు, 20 మంది మనవలు, 20 మంది మునిమనవలు, నలుగురు అనుమనవలు ఉన్నట్టు కుటుంబసభ్యులు చెప్పారు.

తుమ్మలపల్లిలో పేలిన రిఫ్రిజిరేటర్

రూ.5లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన రిఫ్రిజిరేటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి

అల్లవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం తుమ్మలపల్లిలో ఆదివారం రాత్రి కాట్రు రామకృష్ణ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రిఫ్రిజిరేటర్ పేలిపోయింది. ఇల్లు కూడా పాక్షికంగా ధ్వంసమైంది. ఏసీ, మోటారుసైకిల్, మంచాలు, వంట సామగ్రి కాలిపోయి రూ.5లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాద స్థలిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, అమలాపురం అసెంబ్లీ వైసీపీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎంపీపీ యిళ్ల శేషారావు, కొనుకు బాపూజీ, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, కె.శాంతికిరణ్, పులుసుగంటి గంగాధర్ పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చంపేట శివారులో నూతనంగా నిర్మించనున్న 33 కేవీఏ విద్యుత్ ఉప కేంద్రంలో పలు ఫీడర్లకు విద్యుత్ లైన్ల ఏర్పాటు చేయనున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. కొప్పవరం, పనసపాడు గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామనిఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏపీఎన్డీఎస్ ప్రభాకర్ చెప్పారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం


కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

'ప్రభుత్వ భూములను పరిరక్షించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతూ కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడీలపొర నుంచి అక్షర స్కూలు మార్గంలో గొడారిగుంట వరకు రహదారికి ఇరువైపులా ప్రభుత్వ ఖాతాలో ఉన్న భూములను కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గతంలో చీడీలపొర ప్రాంతంలో ప్రభుత్వ భూముల్లో వివిధ ప్రభుత్వరంగ సంస్థలు, సామాజిక భవనాలు, కులసంఘాల భవనాల నిర్మాణాల కోసం కౌన్సిల్ తీర్మానాల ద్వారా సుమారు 20 ఎకరాలకు పైగా భూమి కేటాయించినట్టు గుర్తు చేశారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ స్థలాల్లో అడ్డదారుల్లో భూములు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ బచ్చు శేఖర్, నాయకులు తుమ్మల రమేష్, పలివెల రవి అనంత్‌కుమార్, ఒమ్మి బాలాజీ, గుమ్మల్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాపుల అభ్యున్నతికి సహకారం: ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాపుల్లో ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలు, పేద విద్యార్థుల అభ్యున్నతికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల శుభం కాపు కల్యాణ మండపంలో కాపు సద్భావనా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన విజయవంతంపై జీవిత కాల సభ్యులు, దాతలతో సోమవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక వనసమారాధన విజయవంతానికి మూడు దశాబ్దాలుగా ఎంతోమంది దాతలు అందిస్తున్న సహకారం మరువలేమన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకర్ కోరిక మేరకు జగన్నాథపురంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కాపు, తెలగ అభ్యుదయ భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించేందుకు సభ్యులు సహకారం అందించాలని కోరారు. సద్భావనా సంఘం అధ్యక్షుడు బసవా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంతం నానాజీ, జీవితకాల సభ్యులు, దాతలను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.


కాపు సద్భావనా సంఘం నాయకులతో ఎమ్మెల్యే నానాజీ

'పాడా' పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

పిఠాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ వర్గాల ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు అధికంగా అందాయి. ఏపీడీ వసంతమాధవి 43 అర్జీలను స్వీకరించారు. తారకరామానగర్, గండేపల్లి లే ఔట్ పొలాల మధ్యలో పురపాలక సంఘం రోడ్డు నిర్మించిందని, నీరు పోయేందుకు వీలుగా కల్వర్టు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని 2, 3, 4 వార్డుల సమస్యల పోరాట కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి, అంబేద్కర్ సెంటర్ వద్ద గల డ్రైన్లు తరచూ పూడుకుపోయి రోడ్డుపైకి నీరు చేరుతోందని, దీనిని పరిష్కరించాలని బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర సహ కన్వీనర్ బుర్రి మురళీధరరావు కోరారు. రథాలపేట వద్ద గల అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 19న జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి అవమానం జరిగిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీవీ రావు మాలమహానాడు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడతామని పీవీ రావు మాల మహానాడు నాయకులు వేళంగి వెంకటేష్, కొంగు నూకరాజు, బీఎస్పీ ఇన్‌చార్జి ఖండవిల్లి లోవరాజు హెచ్చరించారు.


పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

కాకినాడ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక న్యాయాన్ని అందించేందుకు దోహదపడాలని కోరుతూ కలెక్టర్ షాన్‌మోహన్‌కు బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో జనాభాలో 56 శాతంగా ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. గత ఎన్నికల్లో చట్టంలో తెలిపిన బీసీలకు 34 శాతం 24 శాతానికి పడిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జనగణనలో భాగంగా రాష్ట్రంలో తక్షణం కులగణన చేపట్టాలన్నారు. రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అన్ని రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీలుగా విభజించాలన్నారు. బీసీలకు రక్షణ చట్టాన్ని తక్షణం తీసుకురావాలన్నారు.

కార్యక్రమంలో సంఘం కాకినాడ సిటీ అధ్యక్షుడు బడే కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, నాయకులు పంపన రామకృష్ణ, బి.సత్యనారాయణ, దారపు శిరీష తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

'అంగన్వాడీల్లో చిన్నారుల హాజరు శాతం పెంచాలి'

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు సంఖ్యను మరింత పెంచాలని, ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీ సమీపంలో గల 1, 2 అంగన్వాడీ కేంద్రాలను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు చేసారు. గుడ్లు, పాలు, పౌష్టికాహార కిట్ల నిల్వలను చూసి రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేశారో లేదో తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పీడీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పీడీ లక్ష్మి పెద్దాపురం పట్టణ పరిధిలోని కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ మరమ్మతులు పూర్తి చేయాలి

ఇన్‌చార్జి కమిషనరు సుధాకర్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో లీకైన తాగునీటి పైపులైన్లను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టామని ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ తెలిపారు. జగన్నాథపురం వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఏర్పడిన పైపులైన్ లీకేజీని సోమవారం ఆయన వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. లీకేజీని అరికట్టేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా లీకేజీలను గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం జగన్నాథపురం హెచ్ఎంఎస్ కార్యాలయం వెనుక పబ్లిక్ ట్యాప్ వద్ద నీటి నమూనాలను పరిశీలించిన అధికారులు తాగునీరు కలుషితం కాలేదని నిర్ధారించారు. వాటర్ వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


మరమ్మతులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనరు సుధాకర్

ఎవరో ఒకరిని ఇన్‌చార్జిగా నియమించండి

జోన్-2 సమావేశంలో కాకినాడ రూరల్ టీడీపీ నాయకుల వినతి

కాకినాడ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'కాకినాడ రూరల్ నియోజకవర్గానికి ఇన్‌చార్జి లేక మా సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు... కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటుతోంది... ఎవరినో ఒకరిని ఇన్‌చార్జిగా నియమించండి' అని రూరల్ టీడీపీ నాయకులు కోరారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జోన్-2 కో-ఆర్డినేటర్, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రావు వెంకట సుజయకృష్ణ రంగారావు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో నెలకొన్న రాజకీయ, సామాజిక పరిస్థితులను, ప్రజా సమస్యలను కో-ఆర్డినేటర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీల పనితీరు, వాటిని మరింత క్రియాశీలకం చేయడంపై చర్చించారు. అనంతరం జిల్లా నాయకులు, కార్యకర్తలు తమ వ్యక్తిగత, పార్టీ సంబంధిత వినతులను కో-ఆర్డినేటర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సుజయకృష్ణ రంగారావు మాట్లాడుతూ కార్యకర్తలను కలుపుకుని పోతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం అంశాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, టీడీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, రూరల్ కో-ఆర్డినేటరు పిల్లి సత్యనారాయణమూర్తి, కో-కో-ఆర్డినేటరు కటకంశెట్టి బాబీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, నాయకులు తోట నవీన్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల రంగనాగ్, బచ్చు శేఖర్, కాలా సత్తిబాబు, కాకినాడ రామారావు, మేకా లక్ష్మణమూర్తి, కొల్లాబత్తుల అప్పారావు, పోతుల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేలతో సమావేశమైన సుజయకృష్ణ రంగారావు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు

కలెక్టరేట్ ఎదుట ధర్నాల హోరు

పెండింగు బిల్లుల కోసం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెండింగు బిల్లులు విడుదల చేయాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు చంద్రమళ్ల పద్మ, కె.సత్తిరాజు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను విద్యార్థికి రూ.20 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛంద సంస్థలు ఇచ్చే వేతనాలను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలన్నారు. 2024లో పెంచిన మెనూ చార్జీలను నేటికీ చెల్లించలేదని, బకాయిలను తక్షణం చెల్లించాలన్నారు. వంట పాత్రలకు, వంట షెడ్ల నిర్మించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. సామూహిక వంటశాలల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. వివిధ మండలాల్లో రాజకీయ కారణాలతో కార్మికులను తొలగించే ప్రక్రియ నిలుపుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, షేక్ పద్మ వెంకటలక్ష్మి, వరలక్ష్మి, సత్యవతి, అమ్మాజీ పాల్గొన్నారు.

ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాకినాడ జిల్లా సమగ్ర శిక్షా జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్, చైర్మన్ మాతా చంటిబాబు మాట్లాడుతూ 21 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాసి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను అన్ని కేటగిరీల్లో పెంచి ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఒడిశా, పంజాబ్, కేరళ ప్రభుత్వాల తరహాలో ఏపీలో కూడా ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. జాబ్ చార్ట్ ప్రకారం సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత వెబినార్ల పేరుతో వేధించవద్దన్నారు. ధర్నాలో ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రవి, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, కోశాధికారి మలకా రమణ, ఏపీఎంఎస్ఆర్ నగర అధ్యక్షుడు స్వామి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నగేష్, నాయకులు నాగమణి, డేనియల్, రాంజీ, మీరాసాహెబ్, స్వర్ణసుధ, అనంతలక్ష్మి, గంగాధర్, సాయికిరణ్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సునీత, విజయలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.


బాధితురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

'బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం'

తాళ్లరేవు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన నిండు గర్భిణి మృతికి కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో జె.నరసింహనాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన బాధితురాలి భర్త మల్లేశ్వరరావు, కుమార్తె, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వపరంగా అదుకుంటామని హామీనిచ్చారు. ఆసుపత్రి సూపర్‌వైజర్లు నెహ్రూరాణి, కుమార్, వైద్యులు, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న వర్మ

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గొల్లప్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆరోగ్య అవసరాల నిమిత్తం గొల్లప్రోలుకు చెందిన ఇద్దరికి రూ.55,500 మంజూరైంది. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సోమవారం లబ్ధిదారుల గృహాల వద్దకు వెళ్లి చెక్కులను అందజేశారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నాయకులు బస్వా సత్యనారాయణ, శీరం మాణిక్యం, దువ్వా తాతాజీ, ఇందన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అడ్డాలకు రాష్ట్ర స్థాయి పురస్కారం

సర్పవరం జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి దంత వైద్యుల సదస్సులో కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ రాష్ట్ర స్థాయి పురస్కారం అవార్డు అందుకున్నారు. ఆయనకు డాక్టర్ వీవీ రావు, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ సిరాజ్, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ మధుమిత, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డాక్టర్ రఘురామ్ అభినందనలు తెలిపారు.

'చదువుతో పాటు క్రీడలూ అవసరమే'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా క్రీడా మైదానంలో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇ-చాంప్స్ కో-ఆర్డినేటర్ రామతులసి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలూ అవసరమేనన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన ఏజీఎం రాఘవేంద్రరావు, ప్రిన్సిపల్ షర్మిల, కవిత, రవి కిషోర్, వీరభద్రరావు, నారాయణ స్పోర్ట్స్ ఆర్‌అండ్‌డీ హెడ్ వినయ్, వైస్ ప్రిన్సిపల్స్, పీఈటీలు క్రీడా జ్యోతి వెలిగించారు. ముఖ్య అతిథి పతాకావిష్కరణ చేయగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌తో గౌరవ వందనం చేశారు. విద్యార్థులకు పిన్‌డౌన్, క్రాస్ ది రివర్, కప్ అండ్ సాసర్, హార్డిల్స్, డార్ట్‌బాల్‌పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్స్ పద్మలత, శ్రావణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇ-చాంప్స్ కో-ఆర్డినేటర్ రామతులసి

'రైతును రాజు చేసేందుకు పంచసూత్రాలు అమలు'

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న నాలుగేళ్లలో వ్యవసాయం ద్వారా రైతును రాజుగా చేసేందుకు ప్రభుత్వం సూచించిన పంచసూత్రాలు అమలుకు సమష్టి కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. 'రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం' పేరిట సోమవారం మండలంలోని మాధవపట్నం గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రైతుల ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం చేపట్టిన పలు పథకాలను వివరించారు. నిమ్మకాయల రంగనాగ్, వ్యవసాయ శాఖ ఏడీ దుర్గాలక్ష్మి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరక్టర్ వెంకటేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, పంచాయతీ కార్యదర్శి టి.సత్యనారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


రైతన్నా మీకోసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

జనవాణిలో అర్జీల స్వీకరణ

సర్పవరం జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనవాణిలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫోనులో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.


అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

'ప్రహరీ కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

సర్పవరం జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి ప్రహరీని కూల్చివేయడమే కాకుండా అడ్డుకోబోతే గునపంతో చంపేస్తామంటూ దాడికి ప్రయత్నించిన అప్పాని విష్ణు, పుల్ల శేషారావులపై పోలీసులు చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలంటూ సోమవారం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బలిరెడ్డి అప్పారావు తెలిపారు. పోలీసులు విచారణ నిర్వహించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, వాళ్ల నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలిపారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మొపర్ణాదాస్, సుదీక్ష, శాంతిజ్యోతి, గీతాంజలి

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు

'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

పెద్దాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ టేబుల్ టెన్నిస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్టు డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో విశాఖపట్నం గీతమ్స్ కాలేజీలో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో 15 రజత పతకాలు సాధించారు. మహిళా విభాగంలో మొపర్ణాదాస్, టి.సుదీక్ష, ఎం.శాంతిజ్యోతి, డి.గీతాంజలి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారితో పాటు కోచ్‌లు వేణు, శ్రీరామ్, సుబ్రహ్మణ్యంలను విజయ్‌ప్రకాష్ అభినందించారు.


విద్యార్థినికి చెక్కు ఇస్తున్న తిరుమల ప్రకాష్

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

కాకినాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఐదుగురు ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.40వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లను ఎన్ఆర్ఐలు చెరుకూరి అనిల్, సుంకర రాజేష్‌బాబు సమకూర్చారు. నగరంలోని రాజేశ్వరినగర్‌లో సోమవారం వాటిని చెక్కుల రూపంలో డాక్టర్ సుంకర సుమ, తిరుమల ప్రకాష్ అందజేశారు. పలువురు సామాజికవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


లక్ష్మీశరణ్యను అభినందిస్తున్న దృశ్యం

సామర్లకోట విద్యార్థినికి అభినందన

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట జడ్పీ బాలికోన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి పి.లక్ష్మీశరణ్య ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్స్‌పోజర్ విజిట్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఆమెను కలెక్టర్ షాన్‌మోహన్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా సోమవారం అభినందించారు. అవార్డు, బహుమతి, ప్రశంసాపత్రాన్ని లక్ష్మీశరణ్యకు అందజేశారు. ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి, సీడీపీవో జి.ఉష, జిల్లా చైల్డ్ రైట్స్ కన్వీనర్ వెంకట్రావు పాల్గొన్నారు.


స్కిల్ ల్యాబ్ బస్సును ప్రారంభిస్తున్న డీఎంఈ

ఆర్ఎంసీలో స్కిల్ ల్యాబ్ బస్సు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ సౌజన్యంతో కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు స్కిల్ ల్యాబ్ బస్సు తరలివచ్చింది. సోమవారం దీనిని డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ ప్రారంభించారు. జనరల్ సర్జరీ, ఆంకాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్స్ విభాగాలకు చెందిన పీజీ వైద్యులు స్కిల్ ల్యాబ్‌లో అధునాతన శస్త్ర చికిత్సల నిర్వహణపై శిక్షణ పొందనున్నారు. సంస్థ ప్రతినిధులతో పాటు ఆర్ఎంసీ బోధకులు వారికి శిక్షణనిస్తారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

'లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం'

పెద్దాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రశాంతి అధ్యక్షతన గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని, శిశు, లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమిష్టి కృషి చేయాలన్నారు. డాక్టర్ అనూష, ఏఎన్ఎంలు, కమిటీ సభ్యుడు కందుల వెంకటచలం పాల్గొన్నారు.

ఎంపీపీ పరామర్శ

కిర్లంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మాజీ ఎంపీపీ కొడెల సావిత్రి ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆమె కుమారుడు కొడెల గంగాధర్ కుటుంబాన్ని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే టీడీపీ నాయకుడు చదరం చంటిబాబు, గొల్లపల్లి సూరిబాబు, కాళ్ల వెంకటేష్, దిడ్డి చిట్టిబాబు, గొడే బుజ్జి గంగాధర్‌ను పరామర్శించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ పీజీఆర్‌ఎస్‌కు 85 అర్జీలు

రంపచోడవరం, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఐటీడీ పీవో స్మరణ్‌రాజ్, సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీవీటీజీలకు గృహాలు, అల్లూరిగడ్డ, జి.కొత్తూరులో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రోడ్డు పనులకు మరమ్మతులు చేయాలని, వ్యవసాయ భూములకు పట్టాలు మంజూరు చేయాలని, భూసమస్యలు పరిష్కరించాలని, పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరుతూ 85అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డీఎల్డీవో కోటేశ్వరరావు, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీఏ రామ్మోహన్, పీహెచ్‌వో దేవదానం, ఏడీఎంహెచ్‌వో సరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సాగు విధానాలకే 'రైతన్నా మీకోసం'

ఎటపాక,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు లాభసాటి వ్యవసాయ సాగు విధానాలు అవలంబించాలన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు పేర్కొన్నారు. సోమవారం టీపీవీడు, ఎటపాక, లక్ష్మీపురం, గుండాలకాలనీ తదితర గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సీఎం చంద్రబాబు రైతుల కోసం రాసిన కరపత్రాలను వారికి పంపిణీ చేశారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను చందు, ఎంపీడీవో నాగమణి రైతులకు వివరించారు. టీడీపీ అరకు పార్లమెంట్ కార్యదర్శి పాటిచలపతి, బాచినేని శ్రీకాంత్, సర్పంచ్ మోసం రాజులు, టీడీపీ నాయకులు బాచినేని మల్లేశ్వరరావు, దుద్దుకూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతన్న నీకోసం కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఏవో కె.వెంకటేశ్వర్లు, వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి రైతులతో మాట్లాడారు. నీటి లభ్యత, ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్, అగ్రికల్చర్ టెక్నాలజీ, ప్రభుత్వ సహకారం తదితర విషయాలు రైతులకు వివరించారు. రైతన్న మీకోసం కార్యక్రమం డిసెంబరు 3వరకు జరుగుతుందన్నారు. రైతుల వద్దకు సిబ్బంది వచ్చినప్పుడు తమ సమస్యలు, సూచనలు తెలపాలన్నారు. ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, తహశీల్దార్ కె.సత్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు గోళ్ల చంటిబాబు, మాగాపు బాబూరావు, జొన్నల నాని, పరిశెట్టి వెంకటేశ్వరరావు, అడబాల వీరభద్రరావు, జొన్నల శ్రీనివాస్‌కుమార్, మడకం శ్రీనివాస్‌దొర, చిక్కాల బూరయ్య పాల్గొన్నారు.

అడ్డతీగల, (ఆంధ్రజ్యోతి): రైతన్న మీ కోసం వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో, మండల వ్యవసాయాధికారి, వ్యవసాయ తదితర శాఖల సిబ్బంది అడ్డతీగల మండలంలోని గ్రామాల్లో రైతుల ఇళ్లకు వెళ్లి రైతులు సాగులో తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించారు. చిరుధాన్యాల సాగు చేపట్టాలని సూచించారు. ఆరు రోజులు రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరిస్తామని ఎంపీడీవో తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అడ్డతీగల, నవంబరు24(ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ వద్ద సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు బుర్లే హరిబాబు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నగదు రైతులకు జమయ్యేది కాదని, టీడీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలుచేసిన మూడో రోజునే రైతు అకౌంట్‌లో నగదు జమవుతున్నాయని తెలిపారు. ఏవో శివప్రసాద్ మాట్లాడుతూ వరి ఏగ్రేడ్ రకం రూ.1792, సాధారణ రకం రూ.1777ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. డైరెక్టర్లు మెడిద గీతదేవి, బలువు సత్యవతి, నాయకులు, సొసైటీ సీఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుర ఆశ్రమ పాఠశాల పరిశీలన

అడ్డతీగల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సోమవారం ఎంపీడీవో సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులు పరిశీలించారు. 129మంది విద్యార్థులకు 117మంది, 10మంది ఉపాధ్యాయులకు ఏడుగురు హాజరయ్యారు. డిప్యూటీ వార్డెన్ ఎస్.కృష్ణతో మాట్లాడి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకుని గోడౌన్ తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు.

అన్నదాత సుఖీభవ నగదు జమపై రైతుల హర్షం

కూనవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు రైతుల ఖాతాల్లో జమకావడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందంటూ రైతులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, పారి సోమయ్య, చిన్ని, హెచ్.రవి తదితరులు పాల్గొన్నారు.

'అవగాహన లేమితో పొరపాటు జరిగింది'

చింతూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అవగాహన లేమి పొరపాటుకు దారి తీసిందని టీడీపీ కార్యకర్త బొక్కిలి అనురాధ పేర్కొన్నారు. సోమవారం చింతూరు టీడీపీ కార్యాలయంలో అనురాధ విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి నుంచి చట్టపరంగా రావాల్సిన పోలవరం భూనష్ట పరిహార వాటా సొమ్ము కోసం గ్రామపెద్దల సమక్షంలో ఇటీవల చర్చించానన్నారు. ఆ మేరకు సంబంధిత కార్యాలయంలో ప్రయత్నించినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదన్నారు. దీంతో సమస్య పరిష్కారానికి గ్రామస్థుల సమక్షంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, అడ్వకేట్ చిన్నారెడ్డికి కేసు అప్పగించానన్నారు. చిన్నారెడ్డి కృషితో అనుకున్నదాని కంటే ముందుగానే తన తండ్రి నుంచి భూనష్ట పరిహారం వాటా సొమ్ము వచ్చిందన్నారు. అడ్వకేట్‌కు చెల్లించాల్సిన ఫీజు ఒప్పంద విషయంలో తమ కుటుంబంలో కొంత గందరగోళం ఏర్పడిందన్నారు. దీంతో సోమవారం పెద్దల సమక్షంలో ఆయనకు చెల్లించాల్సిన ఫీజు ఇరుపక్షాల అంగీకారంతో సర్దుబాటు చేసుకున్నామన్నారు. అయితే ఈవిషయంలో తొందరపాటుతో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంపై చింతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొక్కిలి రవి (అనురాధ భర్త), సీతమ్మ (అనురాధ తల్లి), బీరబోయిన కొండబాబు, బొక్కిలి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవం

రంపచోడవరం, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వెలసిన శ్రీగౌరీ పరమేశ్వరుల ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గవర సంఘం పెద్ద సూరిశెట్టి రామ్మోహనరావు ఆధ్వర్యంలో మూడు రోజులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. అనంతరం గౌరీపరమేశ్వరుల నిమజ్జన కార్యక్రమం నిర్వహించినట్టు హిందూ ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయ కర్త నల్లమిల్లి వేంకటరామారెడ్డి తెలిపారు.

'డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేసుకోవాలి'

రంపచోడవరం, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేసుకోవాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ జేమ్స్ రైతులకు సూచించారు. సోమవారం తామరపల్లిలో రైతన్నా మీకోసం కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ మాట్లాడారు. మినుములు, పెసర, బొబ్బర్ల పంటలతో పాటు కూరగాయలకు డిమాండ్ ఎక్కువ ఉందని, రైతులు తక్కువ నీటిలో పండే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ టీఆర్‌కే చైర్మన్ అబ్బులు, వీఆర్వో డీవీవీ సత్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామసీతా, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సేవలపై ఎన్‌క్యూఏఎస్ టీం తనిఖీ

రంపచోడవరం, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): నరసాపురం పీహెచ్‌సీని సోమవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఏఎస్) టీం సభ్యులు డాక్టర్ అరుముగం, డాక్టర్ సబీర్ పటేల్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న సేవలు, ఆసుపత్రి పరిసరాలు శుభ్రతపై పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.సుజిత, పి.కృష్ణపవన్, డేవిడ్, కేవిన్, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

పలుచోట్ల రైతన్నా మీకోసం కార్యక్రమాలు

జగ్గంపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, సాగును లాభసాటిగా మార్చడమే ఏకైక లక్ష్యంగా 'రైతన్నా మీకోసం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీగా అన్నదాతల ఇళ్లకు వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకుని లాభసాటి వ్యవసాయానికి పలు సూచనలు అందించారు. జగ్గంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గరిమెళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈనెల 24 నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నేరుగా అన్నదాతల ఇళ్లకు వెళ్లి వారితో మమేకమై వ్యవసాయంలో రైతులకు ఎదురవుతున్న సమస్యలను, ముఖ్యంగా అధిక పెట్టుబడి, సరైన మార్కెటింగ్ లేమి వంటి సవాళ్లను అర్థం చేసుకోవడం, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట వ్యవసాయ అధికారి నరసింహం, ఉద్యాన శాఖ అధికారిణి శ్రీవల్లి, వ్యవసాయ సహాయకులు శ్యామ్, సందీప్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



జగ్గంపేట మండలం ఇర్రిపాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని కిర్లంపూడి మండలం వీరవరంలో ఎంపీపీ తోట రవి ప్రారంభించారు. ఏవో సుధామాధురి, సిబ్బంది రైతు కుటుంబాల వద్దకు వెళ్లి సాగులో తీసుకోవాల్సిన మెళకువలు వివరించారు. రైతుల నుంచి పలు సూచనలు, సమాచారం తెలుసుకున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ వాడుతున్న ప్రతీ రైతుకు కల్టివేటర్ యాప్ ఇన్‌స్టాల్ చేశారు. దీని ద్వారా రైతులకు అవసరమైన సమాచారం పొందే అవకాశముంటుందన్నారు. గ్రామ వ్యవసాయాధికారి ఆర్.ప్రసన్న, టీడీపీ గ్రామాధ్యక్షుడు గొల్లపల్లి సూరిబాబు, రైతులు, ధాన్యసేకరణ సిబ్బంది ఉన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పంచసూత్రాలు అనే ప్రతిపాదనతో నీటి భద్రత, అగ్రిటెక్, డిమాండ్ ఆధారిత పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ పథకాలపై రైతులకు సిబ్బంది వివరించారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి రాజేష్, ఉద్యాన శాఖ అధికారిణి దివ్యశ్రీ నేతృత్వంలో యర్ర వరం, లింగంపర్తి గ్రామాల్లో నిర్వహించారు. జిల్లా ఉ ద్యాన శాఖ అధికారి సిరీల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం వారం పాటు జరుగుతుందని.. నీటి భద్రత, ఆధారిత పంటలు, పామాయిల్, చిరుదాన్యాలు, ప్రభుత్వ మద్దతు, పంట సాగు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో రామరాజు వర్మ, బస్వా ప్రసాద్, మైరాల కనకారావు, నూకతాటి ఈశ్వరుడు, గంగిరెడ్ల మణికంఠ, బండారు సూరిబాబు పాల్గొన్నారు.


తునిలో రైతుకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



కిర్లంపూడి: వీరవరంలో అధికారులు, నాయకులు.. ఏలేశ్వరం:లింగంపర్తిలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

యనమలకు 'పెరికో' చైర్మన్ కృతజ్ఞతలు


యనమలని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వీరభద్రరావు

తుని రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెరిక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన వనపర్తి వీరభద్రరావు(బద్రి) సోమవారం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడికి కృతజ్ఞతలు తెలిపారు. తేటగుంట క్యాంప్ కార్యాలయంలో యనమలను మర్యాదపూర్వకంగా కలిసిన బద్రి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. యనమల మాట్లాడుతూ పార్టీకి విధేయతతో పనిచేస్తే ఎప్పటికైనా సముచిత స్థానం దక్కుతుందన్నారు. జిల్లా పెరిక సాధికార సమితి కన్వీనర్ కొమిరిశెట్టి నరసింగరావు, జిల్లా సంఘం కోశాధికారి గోడే బుజ్జి, తొండంగి మండల నాయకులు యడ్ల సూరిబాబు, బెక్కం రాధాకృష్ణ, వనపర్తి సత్యనారాయణ, పోతుల విశ్వనాథం, నామాల సుభద్రరావు, వనపర్తి చిట్టిబాబు, వనపర్తి రాజా, కొల్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలి'

తుని రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆసక్తి ఉంటే ఆకాశమే హద్దుగా ముందుకు సాగవచ్చని నాట్కో ఫార్మ సంస్థలవైస్ ప్రెసిడెంట్, అనాలిటికల్ రీసోర్స్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ కేఎంవీ నారాయణరావు తెలిపారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుసంబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల (అటానమస్) పాయకరావుపేటలో డ్రగ్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మందుల తయారీ విధానం వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, డాక్టర్ వీవీఎస్‌బీ బంగార్రాజు, డాక్టర్ అరుణ్‌కుమార్ త్రిపాఠి ఉన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నారాయణరావు

224 జంటలకు పెళ్లి కానుక అందజేత


లబ్ధిదారులకు పెళ్లి కానుక అందిస్తున్న రంగారావు, జ్యోతుల నెహ్రూ, నవీన్‌కుమార్, రాజశేఖర్

జగ్గంపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాపు సామాజిక భవనంలో జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా 224 జంటలకు పెళ్లి కానుక పేరిట ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున సుమారు రూ.45లక్షలు అందజేశారు. కార్యక్రమానికి రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ పి.రాజశేఖర్ హాజరై చెక్కులను అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ ఎంత కష్టం వచ్చినా తాను ఇచ్చిన హామీలను నెరవేర్చి తీరుతానన్నారు. ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ఉంచి ఆపేసేది కాదని తమ కుటుంబం ఉన్నంత కాలం ఇచ్చిన హామీలను కొనసాగుతాయని అందరికీ తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, అడప భారత్, తోట రవి, జీను మణిబాబు, వీరం రెడ్డి కాశిబాబు, పోతుల మోహనరావు, అడపా తాతాజీ, పిల్ల చంటిబాబు, కోర్పు సాయి తేజ, అడబాల భాస్కరరావు, కందుల చిట్టిబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేసిన కలెక్టర్

ప్రత్తిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందినవారికి సోమవారం కలెక్టర్ షన్ మోహన్ షగిలి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. మండలంలో లంపకలోవ హై స్కూల్‌కు చెందిన సీహెచ్ జ్యోతి, గజ్జినపూడి హైస్కూల్‌కు చెందిన హర్షవర్ధిని, ధర్మవరం ప్రతిభ విద్యాలయానికి చెందిన మేడిబోయిన ఐశ్వర్యకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కలెక్టర్, పీడీ అందజేశారు.


విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

కార్యక్రమంలో ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీవో పద్మావతి, ఐసీడీఎస్ కౌన్సిలర్ దుర్గారాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్ పాల్గొన్నారు.

బుల్లితెర నటుడు ఇంద్రనీల్ దంపతులకు సత్కారం



ప్రత్తిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బుల్లి తెర నటులు ఇంద్రనీల్, మేఘన దంపతులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అభినందించారు. రాచపల్లి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణ రాజు(మీసాల రాజు) ఇంటి వద్ద ఇంద్రనీల్ దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సత్యప్రభకు మద్దతుగా వారు ప్రచారం నిర్వహించారు. అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యుడు బుద్దరాజు గోపిరాజు ఉన్నారు. కాకినాడ టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన జోన్-2 కో ఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావుతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు తదితర అంశాలు చర్చించారు.

29న ప్రత్తిపాడులో మెగా జాబ్‌మేళా

ప్రత్తిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల29న నియోజకవర్గ స్థాయి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, వికాస పీడీ లచ్చారావు తెలిపారు. ప్రత్తిపాడులోని టీడీపీ నేత మదినే దొరబాబు స్వగృహం వద్ద సోమవారం రాత్రి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. పదో తరగతి నుంచి బీటెక్ చదివిన విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఈజాబ్‌మేళాలో 40ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, కూటమి నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, బద్ది రామారావు, బొదిరెడ్డి గోపి, జ్యోతుల పెదబాబు, గ్రామ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం


రైతులకు కరపత్రాలు అందజేస్తున్న పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా తెలిపారు. ప్రత్తిపాడు మున్సిబ్ వారి వీధిలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు, సరుగుడు తదితర వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని తెలిపారు. తుఫాన్‌తో దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతుల కోసం సంచార రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కె.కన్నబాబు, ఎం.సూర్యకిరణ్, వి.రామారావు, సింగిలిదేవ్ సత్తిరాజు, వి.గోపి, మదినే దొరబాబు, చలంకూరి భాను, యాళ్ళ విశ్వేశ్వరరావు, మంతెన శ్రీను, ఇళ్ళ అప్పారావు, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్, ఏవో అమృత రాజేష్, రైతులు పాల్గొన్నారు.

రూ.20వేలు సహాయం

ప్రత్తిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు, ధర్మవరంలోని నలుగురు బాధితులకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, నర్సాపురం వైసీపీ పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.20వేలు అందించారు. ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపీటీసీలు సేంద్రపు భాస్కరరావు, నానిపల్లి సత్యవతి చంటి, మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, వార్డు మెంబర్ తాళ్ళపూడి బుజ్జి పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్యం

ప్రత్తిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాచపల్లి అడ్డ రోడ్డు వద్ద గల సోమవారం అరుణాచల క్షేత్రంలో సోమవారం విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్వామి రామానంద ప్రారంభించారు. హోమియో వైద్యులు లక్ష్మీవినీల, టి.వీరభద్ర వర్మలు 100మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వమానవతా సంస్థ ఫౌండర్ అల్లూరి శ్రీనివాస్ చౌదరి, ఏలేశ్వరం తాతాజీ, ఉప్పల తిరుపతి రావు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆశీస్సులతో దాతల సహకారంతో ప్రతి సోమవారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం గోకవరం గ్రామదేవత గుబ్బలమ్మ దేవస్థానం వైస్‌చైర్మన్ దాత గంద్రెడ్డి సన్యాసిరావు లక్ష్మీ దంపతుల కుమార్తె వసంత పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నెహ్రూ హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో గంద్రెడ్డి సాయిరాం, గంద్రెడ్డి వీర మణికంఠ, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, దేవరపల్లి మూర్తి, జీను పెద్ద రాంబాబు, మండపాక అప్పన్నదొర, మారిశెట్టి రాధా, దేగల సత్తిబాబు, బద్ది సురేష్, సాంబత్తుల చంద్రశేఖర్, మారిశెట్టి గంగ, ఎండి కాజా, దుర్గపు ప్రకాష్ ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ

తుని రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తునిలో 10 మంది రౌడీషీటర్లపై పట్టణ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏ గొడవల్లో తలదూర్చకూడదన్నారు. అసాంఘిక కార్యక్రమాల్లో ప్రమేయం ఉందని గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు అవకాశం

తుని రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో అనధికార భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు కమిషనర్ వెంకట్రావు తెలిపారు. 2025 ఆగస్టు 31కి ముందు అనధికారికంగా, ప్లాన్‌లకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు ప్రభుత్వం అనుమతి పొడిగిస్తూ ఈనెల 12న ఆదేశాలు జారీ చేసిందన్నారు. తుని ప్రజలు 2025 ఆగస్టు 31కి ముందు అనుమతులు పొంది ప్లాన్‌కు విరుద్ధంగా, ప్లాన్ అనుమతి పొందకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరణచేసుకోవాలని కోరారు.

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు శిక్షణ

ఏలేశ్వరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అత్యసవన పరిస్థితుల్లో ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని రక్షించడంపై ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సోమవారం కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నేతృత్వంలో కళాశాల ఆవరణలో వైద్యులు పరిసర విద్యార్థులకు రోడ్డు ప్రమాదంలో గాయపడిన, పాము కాటు, ఊపిరి ఆడనప్పుడు కృత్రిమశ్వాస అందించడం, నీటిలో మునిగినప్పుడు ప్రథమచికిత్స ఏవిధంగా అందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జ్ ప్రగడ ప్రయాగమూర్తి, సురేష్, మదీనా, శివప్రసాద్, శ్రీలక్ష్మీ, ధర్మరాజు, దివ్య, రామలక్ష్మీ, సత్యనారాయణ, కళావతి తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరం డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇస్తున్న వైద్యులు

వైసీపీ 11వేలు సంతకాల సేకరణ

రౌతులపూడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రేవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా మండలంలో 11వేలు సంతకాలు సేకరించినట్టు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జేమీలు తెలిపారు. సంతకాలు పత్రాలను వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ ముద్రగడ గిరికి కిర్లంపూడిలో అందజేసినట్టు తెలిపారు. జడ్పీటీసీ గొల్లు చినదివాణం, వైసీపీ మండల అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ, సర్పం శ్రీను, రమణ, కాకి నాని, వాసిరెడ్డి భాస్కరరావు, పోలుపర్తి తాతాజీ, గోల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండి తల్లిదండ్రులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐ సూర్యఅప్పారావు అన్నారు. సోమవారం సీతారామా కళాశాల అధ్వర్యంలో కొంతంగి- కొత్తూరు గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు వెంకటేశ్వరరావు, అక్కారావు పాల్గొన్నారు.